Email : telanganaveenaoffcial@gmail.com
Title Code : 12280
# తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
epaper.telanganaveena.com సంపుటి :2 సంచిక: 87 హైదరాబాద్ 19 గురువారం, డిసెంబర్ 2024 పేజీలు: 8 రూ.3/-







- అదానీకి తోడు నీడగా ఉంటూ కష్టపడుతున్న రేవంత్..
- అదానీకి వ్యతిరేక ర్యాలీ తీయాలనుకుంటున్నాడు
- కొత్త నాటకానికి శ్రీకారం చుట్టిన రేవంత్ రెడ్డి
- భాయ్, భాయ్ అని వందల, వేల కోట్లు పంచుకున్న సిఎం
- ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదుం
- ఏడాదిలో లక్షల కోట్ల అప్పులు చేశారు
- ఆ పైసలు ఎక్కడ ఖర్చు పెట్టారో లెక్కలు చెప్పాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ అడ్డగోలు అప్పులు, ఖర్చులు చేస్తోంది
- సీఎం, మంత్రుల వేములవాడ పర్యటనలో అడ్డగోలు ఖర్చులు
- భోజనాల ఖర్చు ఒక్కో ప్లేటుకు రూ. 32 వేలు పెట్టింది
- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు

## వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్లుంది

## అదానీకి ఏజెంట్‌గా కొమ్ము కాస్తున్నావు

- దావోస్ వెళ్లి అదానీతో రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్లు
- నీది నిజంగా అదానీ అవినీతి మీద పోరాటం నిజమా?!
- వెంటనే అగ్రిమెంట్లు రద్దు చేసి నిజాయితీ చాటుకో..
- రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు
- సీఎం రేవంత్ రెడ్డి రోడ్ల మీద సర్కస్ ఫీట్లు
- రేవంత్ రెడ్డిని చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుంది
- అసెంబ్లీ బయట డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు పెట్టాలి
- కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారు
- సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదు
- ఎంబీబీఎస్ అడ్మిషన్లలలో తప్పుడు నియమాలు
- వందల మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగింది
- మెడికల్ విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ దే
- లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బ తీస్తాయి
- నేడు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోటాను హైకోర్టు రద్దుచేసింది
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు
- హరీశ్‌రావు పట్ల పోలీసులు అత్యుత్సాహం..
- శాసనసభ ప్రవేశ మార్గంలో పేపర్లు లాక్కున్న పోలీసులు
- ఆటో డ్రైవర్లకు సంఘీభావం..
- ఖాకీ దుస్తుల్లో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం

## ఆదానీ గురించి మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు

- గురివింద చందంగా కాంగ్రెస్ వ్యవహారం
- సిఎం ధర్నా చేయడం దారుణం: కిషన్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన మంత్రివర్గ సహచరులతో పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి హైదరాబాద్ రాజ్ భవన్ ముందు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.



2లో

## అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

అమిత్‌షాపై కాంగ్రెస్ విమర్శలు దారుణం

ఎక్స్ వేదికగా మండిపడ్డ ప్రధాని మోడీ



2 లో



మార్చి నాటికి ట్రిపుల్ ఆర్ భూసేకరణ

అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

## హరీశ్‌రావుకు దబాయించడం తప్ప పని చేయడం తెల్వదు.

హైదరాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):

వచ్చే మార్చి నాటికి రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని, నాలుగేండ్లలో ఆర్ఆర్ఆర్ పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో రోడ్లను విధ్వంసం చేశారని ఆయన మండిపడ్డారు. అసెంబ్లీలో కోమటిరెడ్డి మాట్లాడుతూ 'బీఆర్ఎస్ కు రోడ్లపై అవగాహన లేదు. ఉప్పల్ ఫ్లై ఓవర్ ను ఆరేండ్లు ఖాళీగా పెట్టారు. గత పాలకులకు ఎంతసేపు పైసలు వచ్చే కాళేశ్వరం తప్ప రోడ్లను పట్టించుకోలేదు. కమిషన్ తీసుకుని కూలిపోయే కాళేశ్వరం కట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ కోసం నాలుగు లైన్ల రోడ్లను ఆరు వందల కోట్లతో వేసుకున్నారు. లక్ష కోట్ల విలువ చేసే ఓఆర్ఆర్ అమ్ముకున్నారని ఆరోపించారు. హరీశ్‌రావుకు దబాయించడం తప్ప పని చేయడం తెల్వదు. నేను మాట్లాడుతుండగా ఎంత రిక్వెస్ట్ చేసినా కూర్చోవడం లేదు. ఆయనకు కూలిపోయే కాళేశ్వరం కట్టి కమిషన్ తీసుకోవడం మాత్రమే తెలుసు. రోడ్లు వేయడం చాతకాదు.. కూలిపోయే ప్రాజెక్టులు కట్టారని మంత్రి మండిపడ్డారు.

## ధరిణి పేరుతో భారీగా భూదందా బదలాయింపు

భూమాయతో కాళేశ్వరంను మించిన అవినీతి

భూముల మాయపై ఫోరెన్సిక్ ఆడిట్

2 డిప్యూటి సిం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

## రూ. 22,280 కోట్ల విలువైన మాల్యా, చోక్సీ ప్రాపర్టీలు సీజ్

న్యూఢిల్లీ,డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):



ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విచారణలో భాగంగా అనేక కేసులకు సంబంధించిన ప్రాపర్టీలను సీజ్ చేసి అటాచ్ చేసింది. ఆర్థిక నేరాలకు లింకున్న ఆ ప్రాపర్టీలను స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి సీతారామన్ బదులిస్తూ.. విజయవంతంగా ఈడీ సుమారు 22,280 కోట్ల విలువైన ప్రాపర్టీలను సీజ్ చేసినట్లు చెప్పారు. దీంట్లో విజయ్ మాల్యాకు చెందిన 14,131.6 కోట్లు ఆస్తి ఉన్నట్లు తెలిపారు. ఇక నీరవ్ మోదీ కేసులో 1,052.5 కోట్ల ఆస్తుల్ని బ్యాంకులు జప్తు చేసుకున్నట్లు చెప్పారు. నేషనల్ స్పాట్ ఎక్స్‌చేంజ్ స్కామ్‌లో 17.47 కోట్లు బ్యాంకులు సీజ్ చేశాయన్నారు. ఎస్ఆర్ఎస్ గ్రూపుకు చెందిన 20.15 కోట్లు, రోజ్ వాలీ గ్రూపుకు చెందిన 19.40 కోట్లు, సూర్య ఫార్మసీకి చెందిన 185.13 కోట్లు, నౌషేరా షేక్ గ్రూపుకు చెందిన 226 కోట్లు, నాయుడు అమృతేశ్ రెడ్డికి చెందిన 12.73 కోట్ల ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నాయి. మోహుల్ చోక్సీకి చెందిన 2,565.90 కోట్ల విలువైన ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

## రాజ్‌భవన్ ముందు ధర్నాకు దిగిన ప్రభుత్వ పెద్దలు

అవినీతిపై చర్యకు ప్రధాని వెనకడుగు–ఆదానీ అవినీతికి మోడీ ముసుగు–ఆదానీ అవినీతిపై జెపిసి వేయాల్సిందే–అవసరమైతే రాష్ట్రపతి భవన్ ముందూ ధర్నా–హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా––ధర్నాలో సిఎం రేవంత్, డిప్యూటి సిఎం భట్టి, మంత్రులు



2లో

మొదటి పేజీ తరువాయి

# వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్లుంది

**హైదరాబాద్, డిసెంబర్ 18(తెలంగాణ వీణ):**

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ఈసారి ముఖ్యమంత్రి పాదయాత్ర విషయమై సెటైర్లు వేశారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ ఆసక్తికర పోస్ట్ చేశారు. "వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్టు.. అదానీకి అన్ని రకాలుగా తోడు నీడగా ఉంటూ ఆయన కోసం కష్టపడుతున్న రేవంత్.. ఇవాళ అదానీకి వ్యతిరేక ర్యాలీ తీయాలనుకుంటున్నాడు. జైపూర్ లో సరిగ్గా అతిథి మర్యాదలు జరగలేదనో.. ఢిల్లీలో అపాయింట్‌మెంట్ దక్కలేదనో.. మొత్తానికి కొత్త నాటకానికి శ్రీకారం చుట్టాడు మన చిట్టినాయుడు. భాయ్, భాయ్ అని వందల, వేల కోట్లు పంచుకున్న ముఖ్యమంత్రి.. అదానీ వ్యతిరేక ర్యాలీ తీస్తున్నాడంట. నవ్వి పోదురు నాకేటి సిగ్గు అని%ా%రేవంత్ ని చూసే రాసుంటారూ. మిమ్మల్ని ఎన్నుకున్నంత మాత్రం ప్రజలు మరీ అంత తెలివి తక్కువ వాళ్ళనుకుంటున్నావా? లేక మళ్లీ మళ్లీ మోసం చెయ్యచ్చులే అనుకుంటున్నావా? దొంగే దొంగ అనడం నేడు కామన్ అయిపోయింది" అని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదని నిప్పులు చెరిగారు. కానీ లక్షల కోట్ల అప్పులు చేశారని, ఆ పైసలు ఎక్కడ ఖర్చు పెట్టారని నిలదీశారు. అంతేకాకుండా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా.. సీఎం, మంత్రుల భోజనాల ఖర్చు నిమిత్తం.. ఒక్కో ప్లేటుకు రూ. 32 వేలు ఖర్చు చేసినట్లు వచ్చిన వార్తా కథనాలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అడ్డగోలు అప్పులు, ఖర్చులను కేటీఆర్ ఎండగట్టారు. ఒక్క ఇటుక పెట్టలేదు, గుప్పెడు మన్ను తియ్యలేదు.. కానీ లక్ష ఇరవై మూడు వేల కోట్ల అప్పు ఎందుకు చేశారని కేటీఆర్ ప్రశ్నించారు. అప్పు సరే కానీ భోజనాలు బాగా అయ్యాయా? అని వేములవాడ పర్యటన సందర్భంగా రేవంత్ సర్కార్ చేసిన ఖర్చును కూడా కేటీఆర్ ప్రస్తావించారు. అందరూ కడుపునిండా తిన్నారా..? తిన్నాక పాన్ వేసుకున్నారా? రూ. 32,000 ప్లేట్ భోజనం అంటే అరగాలి కదా? అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. మొదటి పేజీ తరువాయి

# ఆదానీ గురించి మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు

రేవంత్ రెడ్డి వ్యవహారం గురివింద గింజ సామెతను తలపిస్తోందని.. అదానీ అంశంపై మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. రూ.100 కోట్లు అదానీ కంపెనీ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ రూపంలో తీసుకుని ఒప్పందాలు తీసుకున్నారని.. ఎందుకోసం రూ. 100 కోట్ల సహాయం అడిగారో, ఎందుకు కలిసి ఫొటోలు దిగారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వందకోట్ల రూపాయలను స్కిల్ యూనివర్సిటీకి ఖర్చు పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నప్పుడు గుర్తులేదా అంటూ ప్రశ్నించారు. వందకోట్ల సహాయం ఎందుకు అడిగారు? ఎందుకు ఇస్తామన్నారు?.. ఇవన్నీ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని సవాల్ చేస్తున్నా.. రేవంత్ అయినా రాహుల్ గాంధీ అయినా.. ఏ ప్రాతిపదికన అదానీ మీద చర్యలు తీసుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు. ఒక సాక్ష్యం చూపిస్తారా అంటూ సవాల్ విసిరారు. మన మీడియా ముందు, న్యాయస్థానాల ముందు, ప్రజలముందు ఆధారాలు చూపించకుండా.. విమర్శలు చేయడం సరికాదన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇటీవల వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో వరుసగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న పార్టీ.. ఇవాళ ఫ్రస్టేషన్‌లో అదానీ మాట మాట్లాడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం పొరపాటు చేసిందని, కేంద్రం అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ ఇవాళ నిరూపించగలదా అంటూ ప్రశ్నలు గుప్పించారు. మాటమీద నిలబడే సత్తాలేక.. ఇవాళ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదిగా సరైన పాలన లేదని.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి మీద విచారణ లేదని కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా అన్నిరకాల వైఫల్యంతో.. 12 ఏళ్లలో రావాల్సిన ప్రజావ్యతిరేకతను 12 నెలల్లోనే కూడగట్టుకున్నారన్నారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం మీద, మోడీ మీద వ్యక్తిగత విమర్శలు చేస్తూ.. రేవంత్ రెడ్డి ధర్నా చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వైపే ఉన్నారని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులేనంటూ కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతే.. మళ్లీ బీఆర్ఎస్ పార్టీయే రావాలని కాంగ్రెస్ అధిష్టానం.. రేవంత్ రెడ్డిని హెచ్చరించిందా అంటూ కిషన్ రెడ్డి ఆరోపణలు చేశారు.అందుకే రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ పాట పాడుతున్నాడా అంటూ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ బొమ్మ బొరుసు లాంటి వ్యక్తులు అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దొందూ దొందే అని.. ఈ రెండు పార్టీల పాలనకు తేడా లేదని అన్నారు. ప్రజలను వంచించడంలో తెలంగాణ సంపదను దోచుకోవడంలో, కుటుంబ పరిపాలన తీసుకురావడంలో, కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి తేడా లేదని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో.. ఆ రెండు పార్టీల పనిచేసే తీరు ఒక్కటేనన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మూకుమ్మడిగా.. ప్రజాతీర్పును అగౌరవపరిచిన పార్టీలు నాడు బీఆర్ఎస్, నేడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పీఏసీ ఛైర్మన్‌గా, ఎంపీ అభ్యర్థిగా.. కాంగ్రెస్ నియమించడం కంటే బలమైన దోస్తీ ఉంటుందా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా కేసీఆర్ మారిస్తే.. రేవంత్ రెడ్డి మరింత దిగజారుస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఎవరు, ఎప్పుడు అప్పులిస్తరో తెలుసుకునేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిన చరిత్ర రేవంత్ రెడ్డిదంటూ విమర్శింటారు.

# అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

**న్యూఢిల్లీ,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న క్రమంలో...తాజాగా దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. అంబేడ్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు షెడ్యూల్ కులాలు, తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'కొన్నేళ్ల పాటు కాంగ్రెస్ సాగించిన అరాచకాలు, ముఖ్యంగా అంబేడ్కర్‌ను అవమానించిన తీరును ఇప్పుడు చెప్పే అబద్ధాలతో వారు దాచలేరు. అలా అనుకుంటే వారు పెద్ద పొరబాటు చేసినట్లే. ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ చేసిన ప్రయత్నాలను దేశ ప్రజలంతా చూశారు. మనం ఇలా ఉండటానికి అంబేడ్కరే కారణం. గత దశాబ్దకాలంగా ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు మా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసింది. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి ప్రధాన కార్యక్రమాలు ప్రతిఒక్కరికీ ఉపయోగపడ్డాయి. అంబేడ్కర్‌తో అనుబంధం ఉన్న ఐదు ప్రసిద్ధ ప్రదేశాలైన పంచతీర్థాన్ని అభివృద్ధి చేసేందుకు మా ప్రభుత్వమే కృషి చేసింది. దశాబ్దాలుగా చైత్య భూమికి సంబంధించిన పెండింగ్ లో ఉన్న భూ సమస్యను మా ప్రభుత్వమే పరిష్కరించింది. నేను అక్కడ ప్రార్థనకు వెళ్లాను. అంబేడ్కర్ తన చివరి ఏడాదిలో గడిపిన దిల్లీలోని 26 అలీపూర్ రోడ్డును మేము అభివృద్ధి చేశాం. లండన్ లో ఆయన నివసించిన ఇంటిని మా ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఆయన్ను సంపూర్ణంగా గౌరవిస్తుంది మేమే. పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా మాట్లాడి కాంగ్రెస్ చీకటి చరిత్రను బయటపెట్టారు. ఆయన మాట్లాడిన వాస్తవాలను చూసి వారు సైతం ఉలిక్కిపడటంతో పాటు ఆశ్చర్యపోయారు. అందుకే ఇప్పుడు వారు నాటకాలాడుతున్నారు. కానీ, ప్రజలకు నిజం తెలుసు' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటులో షా మాట్లాడిన వీడియోను ఆయన పంచుకున్నారు. రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా అంబేడ్కర్ ను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. షా దళితులను అవమానించారంటూ కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆరోపించారు. బుధవారం పార్లమెంటు ఆవరణలో అంబేడ్కర్ ఫొటో పట్టుకొని నిరసన తెలిపారు. ఆయన హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

# అదానీకి ఏజెంట్‌గా కొమ్ముకాస్తున్నావు

**హైదరాబాద్, డిసెంబర్ 18(తెలంగాణ వీణ):**

సీఎం రేవంత్ రెడ్డి రోడ్ల మీద చేస్తున్న సర్కస్ ఫీట్లు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. మొదటి రోజు శాసనసభకు అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద నిరసనగా టీషర్ట్స్ వేసుకొని వస్తే అడ్డుకున్నారు. తమను సభా ప్రాంగణంలోకి కూడా అడుగు పెట్టనివ్వలేదు. ఈ రోజు రాజ్ భవన్ వద్ద అదానీ అవినీతి గురించి మాట్లాడినట్లు రేవంత్ సర్కస్ చేసిండు. అక్కడికి వెళ్లి కూడా కేసీఆర్ గురించి, బీఆర్ఎస్ గురించే మాట్లాడిండు తప్ప, అదానీ అవినీతి గురించి మాట్లాడింది తక్కువ. మీ పోరాటం అదానీ మీద అయితే మొదటి రోజు మమ్మల్ని ఎందుకు అసెంబ్లీ రాకుండా అడ్డుకున్నావు. నిరసన తెలిపే అవకాశం కూడా ఎందుకు ఇవ్వలేదు. మేము అడుగుతున్నా ఎందుకు అసెంబ్లీలో చర్చ పెట్టడం లేదు అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. దావోస్ వెళ్లి అదానీతో రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్లు చేసుకున్నవు. నీకు నిజంగా అదానీ అవినీతి మీద పోరాటం చేయాలనుకుంటే ముందు వెంటనే అగ్రిమెంట్లు రద్దు చేయ్. నీ మాటల్లో నిజాయితీ ఉంటే, వంద కోట్లు వాపస్ ఇచ్చినట్లు రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్ రద్దు చేసుకోవాలి. అగ్రిమెంట్లు రద్దు చేసి నీ చిత్తశుద్ధిని నిరూపించుకో రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు సవాల్ చేశారు. రామన్నపేటలో డ్రైపోర్టు కోసం ల్యాండ్ ఇస్తే సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు. అదానీ కోసం పోలీసులను పెట్టి అరెస్టులు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశావు. పోలీసు పహారా మధ్య పబ్లిక్ హియరింగ్ చేశావు. అదానీకి ఏజెంట్‌గా కొమ్ముకాస్తున్నావు. ప్రజల కోరిక మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. డైవర్షన్ పాలిటిక్స్, సర్కస్ ఫీట్లు తప్ప ఇంకే లేదు. మీ డబుల్ స్టాండర్డ్‌కు నిదర్శనం మీ చిత్తశుద్ధి లేని పోరాటం అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అదానీ దేశ పరువు తీసిండు అని రేవంత్ రాజ్ భవన్ వద్ద అన్నడు. మరి నువ్వు దావోస్ వెళ్లి ఒప్పందాలు చేసుకొని తెలంగాణ పరువు తీశావు. అదానీకి రెడ్ కార్పెట్ వేసి రాష్ట్ర పరువు తీశావు. ఢిల్లీలో పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ పరువును తీశావు.అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద రేపు అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. నీకు ఆ ధైర్యమే లేదు. అంతర్గతంగా ఒప్పందం మీకు ఉంది. సీఎం రాజ్ భవన్ వద్ద ట్రాఫిక్ జాం చేసిండు. ధర్నాలో పాల్గొన్న అందరి మీద నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కేసులు నమోదు చేయాలి. ధైర్యం ఉంటే, చట్టం అందరికి సమానం అయితే వారి మీద కేసులు పెట్టండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు. తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసినవారికి స్థానిక కోటా పరిధిలోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్‌లు కల్పించాల్సి ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. మెడికల్ విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మెడికల్ అడ్మిషన్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వం లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బ తీస్తాయని మేము ఆనాడే చెప్పాం. ఈ రోజు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోట నియమాలను హైకోర్ట్ రద్దు చేసింది. ఎంబీబీఎస్ అడ్మిషన్ల ఆ తప్పుడు నియమాలతో జరిగినందు వలన వందల మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రం వెలుపల చదివిన, ఇన్‌సర్వీసు అభ్యర్థులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అడ్మిషన్‌లు కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్‌ల నిబంధనలు 2021లోని నిబంధన 8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 148, 149లను కొట్టివేస్తూ మంగళవారం 106 పేజీల తీర్పును వెలువరించింది. ప్రభుత్వానికి నిబంధనలు తీసుకురావడంతోపాటు వాటిని సవరించే అధికారం ఉందని, అయితే అది చట్టానికి అనుగుణంగా ఉండాలని పేర్కొంది. తెలంగాణలో విద్యకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయని తేల్చి చెప్పింది. స్థానిక కోటాకు పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్‌లకు సంబంధించి 2021 పీజీ మెడికల్ అడ్మిషన్‌ల నిబంధన-8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం అక్టోబరు 28న తీసుకువచ్చిన జీవో 148, 149లను సవాలు చేస్తూ దాదాపు 98 పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించడంగానీ, రద్దు చేయడంగానీ చేయలేదని అందువల్ల అన్వయించుకున్నట్టు భావించాలని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 నేపథ్యంలో తెలంగాణలో రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవన్న వాదన అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేసింది. అందువల్ల చదువులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు తెలంగాణకు వర్తిస్తాయని స్పష్టం చేసింది.మరోవైపు హరీశ్‌రావు పట్ల పోలీసులు అత్యుత్సాహం చూపించారు. శాసనసభ ప్రవేశ మార్గం వద్ద హరీశ్‌రావును ఆపిన డీఎస్పీ సుదర్శన్.. ఆయన తీసుకెళ్తున్న పేపర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు.శాసనసభ ప్రవేశ మార్గం వద్ద హరీశ్‌రావును ఆపిన డీఎస్పీ సుదర్శన్.. ఆయన తీసుకెళ్తున్న పేపర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. కారు తనిఖీ పేరుతో హరీశ్‌రావు తీసుకెళు‌న్న పేపర్లను లాక్కున్నారు. డీఎస్పీ సుదర్శన్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం దుర్మార్గమంటూ పోలీసులపై మండిపడ్డారు. ఈ ఘటనపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇంతలా ఎందుకు భయపడుతుందో అర్థం కావడం లేదని అన్నారు. ప్రజా పాలనలో కంచెలు తొలగించామని అంటూనే.. పోలీసులతో అడుగడుగునా అడ్డుకుంటున్నారని విమర్శించారు. శాసనసభ ప్రవేశమార్గంలో తనతో పోలీసులు వ్యవహరించిన తీరుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వద్ద ఉన్న ప్లకార్డులను మండలిలోకి అనుమతించలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వద్ద ప్లకార్డులను పోలీసులు, మార్షల్స్ లాక్కుని.. వారిని లోపలికి పంపించారు. కాగా, ఆటో డ్రైవర్ల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ఇవాళ బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఈ క్రమంలోనే కేటీఆర్, జగదీశ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి సహా ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖాకీ దుస్తులు ధరించి ఆటోల్లో అసెంబ్లీకి వచ్చారు. కాగా ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది.ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా 12వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించింది.

మొదటి పేజీ తరువాయి

# ధరిణి పేరుతో భారీగా భూదందా బదలాయింపు

**హైదరాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

తెలంగాణ రాష్ట్రంలో ధరణి పేరుతో పెద్దఎత్తున భూ బదలాయింపు దందా జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల పరం అయ్యాయని భట్టి ధ్వజమెత్తారు. సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములు చేతులు మారాయని ఉపముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ భూ దందాతో పోల్చితే కాళేశ్వరం వ్యవహారం చిన్న విషయమని ఆయన చెప్పారు. వ్యక్తిగత రెండు, మూడేళ్లపాటు ప్రతి రోజూ ఇదే చేశారని, పార్ట్-బి భూములన్ని సక్రమం చేసుకున్నారని భట్టి ఆరోపించారు. దీని మొత్తాన్ని ఫోరెన్సిక్ ఆడిట్ చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. హైదారాబాద్ పరిధిలోనే ఇలాంటి భూములు సుమారు 15 వేల ఎకరాలు ఉంటాయని అంచనా వేస్తున్నామని, అంత కంటే ఎక్కువగానే ఉండే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. పార్ట్-బిలో భూమి అనుకున్న వారి పేరు మీద రిజిస్ట్రేన్ చేశారని, ఆ తర్వాత వారు ఇంకొకరి పేరు మీద మ్యూటేషన్ చేశారని, ఇలా పెద్ద దందా జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ భూముల గురించి అడిగేవారు లేరని.. ఇనాం, ఎండోన్మెంట్, వక్ఫ్, అవెక్యు భూములన్నీ లూటీ చేశారని డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భూముల యజమానులు దేశంలో లేరని, వారంతా పాకిస్థాన్ వెళ్లారని, ఎవ్వరూ అబ్జెక్షన్ చెప్పకపోవడంతో అధికారులు సైతం సహకరించారని భట్టి ఆరోపించారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తుల మీద బదలాయింపు అయిందని ఆయన చెప్పారు. అదంతా ఇప్పుడు వాళ్ల హక్కు అయ్యిందని, ప్రభుత్వం ఎన్‌వోసీ ఇచ్చింది కాబట్టి భూమి వాళ్లదేనని చెప్పారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో అన్ని నిజాలూ నిగ్గు తేలుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క చెప్పారు.

# తెలుగోడి సాహిత్య సేవకు పట్టం..

## అభ్యుదయ కవి లక్ష్మీ నారాయణ అత్యున్నత పురస్కారం

## కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ ను గెలుచుకున్న కవి

**న్యూఢిల్లీ,డిసెంబర్ 18(తెలంగాణ వీణ):**

కేంద్ర ప్రభుతం ఉత్తమ సాహిత్యాన్ని అందించే సృజనాత్మక సాహిత్యవేత్తలకు ప్రతి సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందజేస్తుంది. భారతీయ సాహిత్య పురస్కారాల్లో అత్యున్నతమైన పురస్కారంగా ప్రసిద్ధిగాంచిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ 2024 సంవత్సరానికి గాను పలు భాషలకు చెందిన సాహితీ వేత్తల కథలు, కవితలు, సంపుటాలకు ఈ అత్యుత్తమ పురష్కారం అందుకోనున్నారు. తెలుగు భాషలో ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరుకి చెందిన ప్రముఖ కవి, న్యాయవాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ కోసం ఎంపికయ్యారు. లక్ష్మీ నారాయణ వృత్తి రీత్యా న్యాయవాది. అంతేకాదు ఆయన అభ్యుదయ కవి. శ్రామిక పక్షపాతిగా పేరు గాంచారు. ప్రస్తుతం అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శిగాను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగాను పనిచేస్తున్నారు. 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. వివిధ విమర్శనా గ్రంథాలను, సాహిత్యవ్యాసాల సంపుటి , కవిత్వాన్ని రచించారు. ఇప్పటికే ఆయన తెలుగు భాషాపురస్కారం, సుంకర సత్యనారాయణ స్మారక పురస్కారం, మిలీనియం లాయర్ పురస్కారం లను అందుకున్నారు. లక్ష్మీ నారాయణ 1954, అక్టోబర్ 24వ తేదీన గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెం గ్రామంలో గోవిందరెడ్డి, లింగమ్మ దంపతులకు జన్మించారు. మధ్యతరగతి కుటుంబం.. తండ్రి ఓ సామాన్య రైతు.. బిఎ డిగ్రీ చదివిన తర్వాత బీఎల్ చేశారు. గుంటూరులో న్యాయవాద వృత్తిని చేపట్టారు. భార్య పేరు గీత, టీచర్ గా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 21 భాషలకుగాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను సాహిత్య అకాడమీ ప్రకటించింది. బెంగాలీ, ఉర్దూ, డోగ్రి భాషలకు సంబందించిన అవార్డులను త్వరలో ప్రకటించనున్నారు. పురష్కరాలకు ఎంపికయిన రచయితలకు వచ్చే సంవత్సరం దేశ రాజధాని ఢిల్లీలో ఈ పురష్కరాలను అందజేయనుంది. శాలువా తో సన్మానం చేసి ఆ అవార్డు కింద లక్ష రూపాయల నగదును బహుమతిగా అందజేయనున్నారు.

మొదటి పేజీ తరువాయి

# రాజ్‌భవన్ ముందు ధర్నాకు దిగిన ప్రభుత్వ పెద్దలు

**హైదరాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకు పోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారని ఆక్షేపించారు. ఆదానీని ప్రధాని వెనకేసుకుని వచ్చినా, అమెరికా మాత్రం వదలదని హెచ్చరించారు. ఆదానీపై చర్యలకు ఢిల్లీలో కూడా ధర్నాకు వెనకాడబోమని సిఎం రేవంత్ హెచ్చరించారు. మణిపుర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ సమీపంలో సీఎం బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. 75 ఏళ్లు కష్టపడి దేశ ప్రతిష్టను కాంగ్రెస్ పెంచితే.. ప్రధాని మోడీ, ఆయన మిత్రుడు అదానీ కలిసి దేశ పరువు తీశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లస్ రోడ్ నుండి రాజ్ భవన్ వరకు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున ర్యాలీ తీసి రాజ్ భవన్ రూట్‌లో బైఠాయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వ్యాపారం చేసేందుకు బిలియనీర్ అదానీ లంచాలు ఇచ్చినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చాయి.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలదీశారు.. కానీ ప్రధాని మోడీ దీనిపై మౌనంగా ఉంటున్నారని అన్నారు. అదానీతో ప్రధాని మోడీకి లాలూచీ ఒప్పందం ఉందని.. అందుకే అదానీ కాపాడటానికి ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు రాజ్ భవన్ ముట్టడించామని తెలిపారు. మా పోరాటం ఇక్కడితో ఆగదని.. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రపతి భవన్ ముందు ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వమే ధర్నాలు చేయడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు.. కానీ దేశ ప్రతిష్టను కాపాడుకోవడానికే రోడ్డుపై నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే నిరసన చేపడుతున్నామని స్పష్టం చేశారు. విధిలేని పరిస్థితుల్లోనే మేం ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని.. ముఖ్యమంత్రి ధర్నా చేస్తారా అని బీఆర్ఎస్ అంటోంది.. నేను ధర్నా చేయను.. మరీ వాళ్లు వచ్చి చేస్తారా అని ప్రశ్నించారు. అదానీ అంశంపై బీఆర్ఎస్ వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ సై అంటే అసెంబ్లీలో ఆదానీ అంశంపై చర్చించి తీర్మానం చేస్తామని అన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో ఆయన మిత్రుడు, బిలియనీర్ గౌతమ్ అదానీ దేశ సంపద దోచుకుంటున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అదానీ దేశ ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపించారు. అదానీ దేశ ప్రజలను సొమ్మును ఏ విధంగా దోచుకుంటున్నారు.. బ్యాంకులను ఓ విధంగా మోసం చేశారో హిండెన్ బర్గ్, అమెరికా న్యాయవాదులు చెప్పారని గుర్తు చేశారు. అదానీ ఆర్థిక అవకతవకలపై పార్లమెంట్‌లో చర్చ కోసం కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఫైర్ అయ్యారు. కొన్ని నెలలుగా జాతుల మధ్య అల్లర్లతో మణిపూర్ అట్టుడికిపోతున్న మోడీ నోరు విప్పడం లేదని విమర్శించారు. ఈ క్రమంలోనే అదానీ ఇష్యూ, మణిపూర్ అల్లర్ల విషయంలో ప్రధాని మోడీ మౌనాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ఆందోళనలకు దిగామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

## చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన చేగుంట ఏ ఎస్ ఐ, రవీందర్

**తెలంగాణ వీణ, చేగుంట**

మెదక్ జిల్లా చేగుంట లో సైబర్ నేరాలపై జిల్లా ఎస్పీ ఆదేశానుసారం చేగుంట ఎస్ ఐ చైతన్య రెడ్డి, ఆధ్వర్యంలో ఏఎస్ ఐ రవీందర్, చేగుంట బోనాల రూట్ ఆటో స్టాండ్ దగ్గర ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు,వారు ఏఎస్ఐ రవీందర్,మాట్లాడుతూ, మండలంలో ఉన్న ప్రజలు, ఎవరు ఏమి ఫోన్ చేసినా, ఓటిపి చెప్పకూడదని, బ్యాంకు నుంచి ఫోన్ చేసినాము, మీకు జాబ్ వస్తది, మీరు ముందుగా , మాకు కొన్ని డబ్బులు కట్టమని చెపుతారు, ఇలాంటి మోసపూరిత ఫోన్ కాల నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు, ఎవరైనా సైబర్ నేరాలకు మోసపోతే, అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్ కు కానీ , 1930 కు కానీ ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు, ఈ కార్యక్రమం లో ఏఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది,నాయుడు,వెంకటేష్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు,





## చేగుంట మండల్ రుక్మాపూర్ విలేజ్ ఇందిరమ్మ ఇండ్ల ఇంటింటి సర్వే

**తెలంగాణ వీణ, చేగుంట**

చేగుంట మండలం రుక్మాపూర్ విలేజిలో ఇందిరమ్మ ఇండ్ల ఇంటింటి సర్వే లో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు అందరికీ చేరే విధంగా పకడిబందుగా అధికారులతో సర్వే ద్వారా వివరాలు సేకరిస్తున్నారు ఇట్టి కార్యక్రమంలో %జుఖిఎం% చైర్మన్ మేకల పరమేష్ గ్రామపంచాయతీ సెక్రటరీ బాలు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు శ్రీ రామ్ శివయ్య మేకల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు



## మళ్లీ పెళ్లి చేసుకున్న మహిళకు చనిపోయిన భర్త ఆస్తిలో వాటా- మద్రాసు హైకోర్టు సంచలన తీర్పు

**మద్రాసు,డిసెంబర్ 18(తెలంగాణ వీణ):**

భర్త మరణించిన తర్వాత మళ్లీ పెళ్లి చేసుకున్న మహిళకు చనిపోయిన తన భాగస్వామి ఆస్తిలో వాటా ఉంటుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. హిందూ వివాహ చట్టం కింద మరణించిన తన భర్త ఆస్తిని వారసత్వంగా పొందకుండా నిరాకరించే నిబంధనేదీ లేదని ఓ కేసు విషయంలో వ్యాఖ్యానించింది. తమిళనాడులోని సేలం ప్రాంతానికి చెందిన మల్లిక అనే మహిళ భర్త చిన్నయ్యన్ కొంత కాలం క్రితం మరణించారు. ఆ తర్వాత ఆమె మళ్లీ పెళ్లి చేసుకున్నారు. అయితే ఆమెకు చనిపోయిన తన భర్త ఆస్తిలో వాటా ఇచ్చేందుకు చిన్నయ్యన్ కుటుంబసభ్యులు నిరాకరించారు. ఆ విషయంలో మల్లిక సేలం జిల్లా కోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆమెకు నిరాశ ఎదురైంది. దివంగత భర్త ఆస్తిని వారసత్వంగా పొందకుండా నిరోధించడానికి ఆమె పునర్వివాహం ఒక కారణమని పేర్కొంది జిల్లా కోర్టు.ఆ తర్వాత దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు మల్లిక. విచారణకు స్వీకరించిన హైకోర్టు, దిగువ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.




### లగచెర్ల రైతుల పై కేసులు,ఆశ వర్కర్లపై

## దాడులుచాలా దురదృష్టకరం

:దుర్గపు క్రిష్ణ గౌడ్ 1వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు

**తెలంగాణ వీణ/నాచారం:**




బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ బొమ్మ దగ్గర లగచెర్ల రైతులు పై కేసులు పెట్టి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైలలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ, అవమనీయ, అణిచివేత విధాలనలకు నిరసనగా. రైతన్నల పై అక్రమ కేసులను ఎత్తివేయాలి, వారిని వెంటనే విడుదల చేయాలని దుర్గపు కృష్ణ గౌడ్ అన్నారు.అదేవిదంగా ఆశ వర్కర్లపై జరుగుతున్న దాడులపై నిరసనగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన భారతదేశ రాజ్యాంగాన్ని ఆనుసరించి ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు తెలంగాణలో సరియైన పాలన చేసేలాగా కనువిప్పు కలగాని అంబేద్కర్ కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి,జనరల్ సెక్రెటరీ మీసాల క్రిష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్,సహకార బ్యాంక్ డైరెక్టర్ జడిగే రమేష్,కార్పొరేటర్లు చక్రపాణి గౌడ్, రామచంద్ర రెడ్డి,శ్రీధర్ గౌడ్ కోఆప్షన్ సభ్యులు అలీమ్ డివిజన్ ఇంచార్జిలు డివిజన్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ఉద్యమకారులు పార్టీ యువకులు అందరూ పాల్గొనడం జరిగింది.



## ఐడిసి ఎం ఎస్ చైర్మెన్ కలిసిన శ్రీ దుర్గా ఎం డి.

**తెలంగాణా వీణా హైదరాబాద్**

నిజామాబాద్ జిల్లా ఐడి సి ఎం ఎస్ చైర్మెన్ గా బి.తారా చంద్ ఏక గ్రీవంగా ఎన్నిక కాగా శ్రీ దుర్గా కంపెనీ ఎం.డి జోగన్ పల్లి సంతోష్ మర్యాద పూర్వకంగా కలిశారు.



## కిమ్స్‌కు వెళ్లిన అల్లు అరవింద్

### బాలుడు శ్రీతేజ్ ఆరోగ్యంపై ఆరా

**హైదరాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఏర్పడి రేవతి అనే మహిళ మృతి చెందగా ఆమె కొడుకు శ్రీతేజ్ ఆసపత్రిలో చికిత్స పొందుతున్నారు. తాజాగా కిమ్స్ ఆసుపత్రికి అల్లు అర్జున్ తండ్రి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ వెళ్లారు. శ్రీ తేజ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆరా తీసినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత శ్రీ తేజ్ కుటుంబ సభ్యులతో సైతం ఆయన మాట్లాడినట్టుగా చెబుతున్నారు.పుష్ప 2 సినిమా ప్రీమియర్ సందర్భంగా అల్లు అర్జున్ ఆ థియేటర్ కి వెళ్లడంతో తొక్కిసలాట ఏర్పడింది. రేవతి అనే మహిళ మృతిచెందగా ఆమె కుమారుడు శ్రీ తేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ రోజు నుంచి శ్రీ తేజ్ కి హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే ఆ కుటుంబానికి అండగా ఉంటానంటూ అల్లు అర్జున్ ప్రకటించి పాతిక లక్షలు సాయం చేస్తామని వెల్లడించారు. ఇప్పటికే 10 లక్షల రూపాయలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అంతేకాక చికిత్సకు అవసరమైన ఒక ఇంజక్షన్ కూడా సింగపూర్ నుంచి తెప్పించినట్లుగా తెలుస్తోంది. ఇక తొక్కిసలాట కారణంగా శ్రీ తేజ్ తల్లి రేవతి మరణించింది. ఆ రోజు నుంచి శ్రీ తేజ్ ఆరోగ్య ఇబ్బందికరంగా ఉందని చెబుతున్నారు. నిన్న హైదరాబాద్ సిపి సివి ఆనంద్ తెలంగాణ హెల్త్ సెక్రటరీ క్రిస్టినాతో కలిసి శ్రీ తేజను పరమర్శించారు. శ్రీ తేజ్ ఇంకా స్పృహలోకి రాలేదని, అప్పటి నుంచి వెంటిలేటర్ మీదనే ఉంచి చికిత్స అందిస్తున్నారని తెలుస్తోంది. ఇక ఈ మేరకు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు మంగళవారం ఒక హెల్త్ బులిటెన్ సైతం రిలీజ్ చేశారు.

## ఆధునీకరించిన చర్లపల్లికి 28న ప్రారంభోత్సవం

### మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలసి కిషన్ రెడ్డి రాక

### రూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యల కల్పన

**హైదరాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఈనెల 28న రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. దీంతో ఇది మహానగరం సిగలో మరో మణిహారం కానుంది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సుమారు రూ. 430 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ స్టేషన్ భవనంలో ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్ట్‌లు, ఆరు బుకింగ్ కౌంటర్లు, పురుషులు, మహిళలకు వేర్వేరు వెయిటింగ్ హాళ్లు, హైక్లాస్ వెయిటింగ్ ఏరియా, గ్రౌండ్ ఎ÷-లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఉంది. మొదటి అంతస్తులో కెఫెటేరియా, రెస్టారంట్, రెస్ట్‌రూమ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కొత్త డిజైన్‌లో ప్రయాణికుల రాకపోకలకు విశాలమైన స్థలం (కాన్కోర్స్), ముందువైపు ప్రకాశవంతమైన లైటింగ్‌తో ఆధునిక ఎలివేషన్‌ను తీర్చిదిద్దారు. ప్రయాణికులకు ఉచిత వై÷ సదుపాయం కల్పించనున్నారు. హైదరాబాద్ శివారులోని ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక.. పలు రైళ్లు ఇక్కడి నుంచే ప్రారంభం కానున్నాయి. తద్వారా జంటనగరాల్లోని ప్రధాన రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గించాలనేది రైల్వే శాఖ లక్ష్యం.ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక నగరంలోని నాంపల్లి, కాచికూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లపై ప్రయాణికుల ఒత్తిడి గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడి నుంచే నగరం నలుమూలలకు ప్రయాణికులు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అదనంగా కొత్తగా మరో 25 జతల రైళ్లు ఇక్కడి నుంచి పరుగుల తీయనున్నాయి. లక్షల్లో ప్రయాణికులు రాకపోకలు సాగించనున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజారవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టింది.

## లగచరల్ దాడి కేసులో ఊరట

### నిందితులకు బెయిల్ మంజూరు

**హైదరాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

లగచర్లలో అధికారులపై దాడి కేసులో నిందితులందరికీ నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం బెయిల్‌ను మంజూరు చేసింది. పట్నం నరేందర్ రెడ్డితో పాటు సురేష్, మిగతా నిందితులు అందరికీ బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పట్నం నరేందర్ రెడ్డి రెండు 50 వేల ష్యూరిటీలు, మిగతా వారు 20 వేల పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. మూడు నెలల పాటు ప్రతి బుధవారం పోలీసుల ముందు విచారణ హాజరుకావాలని పట్నం నరేందర్ రెడ్డికి ఆదేశాలు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీ స్థాపనపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , ఇతర రెవెన్యూ అధికారులపై స్థానికుల దాడి జరిగింది. ఈ దాడిలో అధికారులు ప్రయాణిస్తున్న వాహనాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై దాడి జరగడంతో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీ ఈ ఘటన వెనుక బీఆర్ఎస్ పార్టీ హస్తం ఉందని ఆరోపించింది. స్థానికులను రెచ్చగొట్టి అధికారులపై దాడి చేయించారని కాంగ్రెస్ విమర్శలు చేసింది. బీఆర్ఎస్ నేతల ఆదేశాల మేరకు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తన అనుచరుడు భోగమోని సురేష్‌తో కలిసి ఈ దాడి ఎ÷-లాన్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# లోటుపాట్లు సరిచేసుకుంటాం

### అక్రమార్కులను వదిలేది లేదు.

### 5 నెలల్లో 200 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

**హైదరాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

లోటుపాట్లు ఏమైనా ఉంటే వాటిని సవరించుకొని మరింత నిబద్ధతతో హైడ్రా పనిచేస్తోందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వివిధ సందర్భాలలో కోర్టులు ఇచ్చిన తీర్పులకు లోబడి హైడ్రా ముందుకు వెళ్తోంది. ప్రభుత్వం దిశానిర్దేశం మేరకు హైడ్రా పని చేస్తుంది. హైడ్రాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెట్టింది. సాంకేతికంగా కూడా మరింత బలంగా తయారవుతుంది. గత 5 నెలల్లో హైడ్రా దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన చేసింది. హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ హైడ్రా కూల్చదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. 'అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు జులై 2024కి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే హైడ్రా కూల్చదు. ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు లేకుండా కట్టిన వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం కూల్చక తప్పదు. గతంలో అనుమతులు ఇచ్చి తరువాత రద్దు చేస్తే అవి అక్రమ కట్టడాలే అవుతాయి. అనుమతులు ర్దదైనా నిర్మాణాలు జరుగుతుంటే అక్రమ కట్టడాలుగానే పరిగణిస్తాం అన్నారు. పేదలను ముందు పెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్ చర్యలను హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుంది. మల్లంపేట కొత్వాల్ చెరువు, అమీన్‌పూర్‌లో కూల్చివేసినవి అక్రమ కట్టడాలే. ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు హైడ్రా ప్రాధాన్యత ఇస్తుంది. 12 చెరువుల్లో కూల్చివేతలు చేపట్టాం.. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి నివేదించాం.

# భావి నగరానికి బాటలు

### ఫ్యూచర్ సిటీకి రవాణా సౌకర్యం కోసం కార్యాచరణ

### ఔటర్ తరహాలో 40 కిలోమీటర్ల మేర నిర్మాణం

### తొలి దశలో 458 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్

### భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, డిసెంబర్ 18(తెలంగాణ వీణ):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ( భావి నగరాని)కి రవాణా సౌకర్యాల కోసం అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఫ్యూచర్ సిటీకి చేరుకునేలా ఔటర్ తరహాలో 330 అడుగుల రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా రిజినల్? రింగ్?రోడ్డు వరకు 40 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించడంతోపాటు వెయ్యి ఎకరాల ప్రైవేటు భూములను అధికారులు సేకరించనున్నారు. ఈ సందర్భగా తొలి దశలో 458 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్? జారీ చేశారు. కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా ప్రాంతీయ రింగ్‌రోడ్డుకు నిర్మిస్తున్న రహదారి శంషాబాద్ విమానాశ్రయంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సులభంగా చేరుకునేలా ఉంటుందని వివరిస్తున్నారు. హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ, రహదారులు, భవనాలశాఖ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. శంషాబాద్ - పెద్దఅంబర్‌పేట్ ఔటర్ ఎగ్జిట్ నంబర్ 13 వద్ద కొంగరకలాన్ నుంచి మీర్‌ఖాన్ పేట్‌లోని ఫ్యూచర్‌సిటీకి, అక్కడి నుంచి ఆమన్‌గల్ మండలం ఆకుతోటపల్లి వద్ద రీజనల్‌రింగ్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ రోడ్డు అందుబాటులోకి రానుంది. దీనితోపాటు సర్వీస్ రోడ్లు కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు వికారాబాద్ జిల్లాలోని లగచర్లలో భూసేకరణపై జరిగిన రైతుల వ్యతిరేకత, దాడి ఘటనలను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తులు, రైతుల నుంచి భూములు సేకరిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# వ్యవసాయాభివృద్ధికి తక్షణ చర్యలు

## పంటలకు కనీస మద్దతు ధరల స్థిరీకరణ ముఖ్యం

## పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ వెల్లడి

**న్యూఢిల్లీ,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

వ్యవసాయ చట్టాలు తీసుకుని వచ్చినప్పుడు ప్రధాని మోడీ కనీసం ఏ ఒక్కరితోనూ చర్చించలేదు. దేశవ్యాప్తంగా నిరసనలు రావడంతో దానిని వెనక్కు తీసుకున్నారు. అప్పుడు చట్టంలోని మంచిని గానీ చెడును గానీ పార్లమెంటులో కనీసంగా అయినా చర్చించలేదు. ఈ క్రమంలో పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పి) చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు, పలు రైతు సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కోరుతూ శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద రైతులు ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ సిఫారసు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, జలంధర్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చెన్నీ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లపై లోక్‌సభకు తన తొలి నివేదికను అందజేసింది. నిజానికి మద్దతు ధరలతో పాటు, వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు రావాల్సి ఉంది. రైతులకు మద్దుతతో పాటు, వ్యవసాయ ప్రోత్సాహకాలు అందాలి. అలాగే దేశంలో ఆహారధాన్యాల దిగుబడిని పెంచుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే వీటి దిగుబడులు తగ్గించుకోవడం ద్వారా దేశీయంగా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.దేశంలో వ్యవసాయ సంస్కరణలు, రైతుల సంక్షేమం కేంద్రంగా జరుగుతున్న చర్చలో ఎంఎస్‌పీల అమలు కేంద్ర బిందువుగా ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పిస్తే దేశంలో రైతుల ఆత్మహత్యలను తగ్గించవచ్చునని పేర్కొంది. రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, మార్కెట్‌లో నెలకొంటున్న అస్థిర పరిస్థితుల నుండి వారికి రక్షణ కల్పించడం, రుణ భారాన్ని తగ్గించడం ద్వారా ఆత్మహత్యల నుండి రైతులను కాపాడవచ్చు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది. రైతుల ఇక్కట్లకు, ఆత్మహత్యలకు రుణభారమే కారణమని కమిటీ అభిప్రాయపడింది. అన్నదాతలు, వ్యవసాయ కార్మికుల రుణాలను మాఫీ చేసేందుకు ఓ పథకాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రానికి సూచించింది. 2021-22, 2024-25 మధ్యకాలంలో వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖకు అధిక కేటాయింపులు జరిపినప్పటికీ కేంద్ర ప్రణాళికా వ్యయంలో ఈ శాఖ వాటా 3.53 శాతం నుండి 2.54 శాతానికి తగ్గిపోయిందని కమిటీ అందజేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పాదకతను మెరుగుపరచడానికి వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కమిటీ కోరింది. పిఎం - కిసాన్ పథకానికి అందిస్తున్న వార్షిక మద్దతును రూ.6,000 నుండి రూ.12,000కు పెంచాలని కూడా సిఫారసు చేసింది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అందేలా చూడడానికి సాధ్యమైనంత త్వరగా జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వారికి లభించాల్సిన హక్కులు దక్కుతాయని కమిటీ తెలిపింది. ఇకపోతే గ్రామీణ ఉపాధి హామీ చట్టం వేతనాలు పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా లేవని పార్లమెంటరీ ప్యానెల్ తెలిపింది. ఎంజిఎన్ఆర్ఇజిఎపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ప్యానెల్ తన నివేదికను పార్లమెంట్ ఉభయ సభల్లో సమర్పించింది. ఈ పథకం కింద 2008 నుంచి చెల్లిస్తున్న వేతనాలపై ప్యానెల్ అధ్యయనం చేసింది. తక్కువ వేతనాలు, ఆలస్యంగా చెల్లింపులు చేయడం కార్మికుల్ని నిరుత్సాహపరుస్తుంది.మెరుగైన వేతనాలు ఇచ్చే ప్రాంతాలకు వలస, పనికోసం వెళ్లడానికి ప్రేరేపిస్తుందని ప్యానెల్ పేర్కొంది. ఉపాధి వేతనాల స్థిరీకరణ కోసం ఇప్పటి వరకూ బేస్ రేట్‌ను సవరించలేదని ప్యానెల్ విమర్శించింది.

# ఆటో డ్రైవర్లను ఆదుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### ఖాకీ చొక్కాలతో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**




ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంఘీభావం తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోరుతూ.. ఖాకీ చొక్కాలు ధరించి తెలంగాణ అసెంబ్లీకి బయల్దేరారు. ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. కాగా, ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల జాబితాను ఇచ్చామని పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన పడ్డట్టే ఉందని అన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ఇస్తామన్న 12వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని.. బీఆర్ఎస్ పక్షాన వారికోసం పోరాడతామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు, వారికి ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించాలని ఇప్పటికే బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా 12వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించింది.

# ఏడాదిలో ఎన్ని పనులు చేసినట్లు

## ప్రజల్లో భరోసా కల్పించడంలో అడుగులు పడాలి

## రేవంత్ సంకల్పంతో సాగితేనే లక్ష్యసాధన

**హైదరాబాద్,డిసెంబర్18 (తెలంగాణ వీణ):**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. అయితే ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు. మంత్రుల మధ్య సమన్వయం కనిపించడం లేదు. అలాగే ప్రతి విషయానికి ఢిల్లీ నుంచి అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి తప్పడం లేదు. అక్కడికి వెళ్లి దర్శనం చేసుకోవడం తప్పడం లేదు. హామీలపై విపక్షాలు నిలదీస్తున్నాయి. కాంగ్రెస్ గట్టిగా మాట్లాడలేని పరిస్థితి కనిపిస్తోంది. స్వరాష్ట్రంలో పదేళ్లుగా ఎదురే లేదనుకున్న గులాబి పార్టీని ఓడించి, తెలంగాణకు రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఇక అంతే దూకుడుగా రేవంత్ రెడ్డి పాలనలో దూసుకుపోతున్నా..కార్యాచరణలో మాత్రం దాని ప్రభావం కానరావడం లేదు. ఈ క్రమంలోనే సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా సవాలుగా మారుతోన్న వాతావరణ మార్పులను అధిగమించేందుకు రేవంత్ రెడ్డి ఈ దిశగా అడుగులు వేస్తున్నారు. మూసీ పునరుద్ధరణ, సుందరీకరణ ఇందులో ప్రధానమైనది. హైడ్రా ఏర్పాటుతో హడలెత్తించినా..అంతగా ఫలితాలు కానరావడం లేదు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పునరుద్ధరణ, పునరుత్పాదక ఇంధనం తోపాటు తెలంగాణకు పచ్చదనం భవిష్యత్ తరాలకు అందించేందుకు కీలక ముందడుగు వేశారు. పర్యావరణ పునరుద్ధరణలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ముఖ్యమైన ప్రాజెక్టుల్లో సరస్సులు, చెరువుల పునరుద్ధరణ ప్రధానమైంది. ఒకప్పుడు చెరువులకు, సరస్సులకు పెట్టింది పేరైన భాగ్యనగరంలో కబ్జాల కారణంగా చెరువులు, కుంటలు కుదించుకుపోయి, ఉనికిని కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో ప్రత్యేక వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీంతో చెరువుల్లోని అక్రమ కట్టడాలను పని పడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరు 75 చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ మహానగరం పరిధిలోని మొత్తం 2000 చెరువుల రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా నిర్జీవమైన నీటి వనరులను పునరుద్ధరించనున్నారు. జీవవైవిధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు భూగర్భ జలాలు నిండేలా ప్రణాళికలు చేస్తున్నారు. వలస పక్షులను తిరిగి తెలంగాణ గడ్డపై విహరించేలా ఎ÷-లాన చేస్తున్నారు. చెరువులకు కొత్త శోభ తీసుకురావడంతో ఫ్లెమింగోలు, రెడ్ బ్రెస్టెడ్ ÷÷-లక్యాచర్ వంటి జాతులకు చెందిన పక్షులు తిరిగిరావాలని భావిస్తున్నారు. పర్యావరణ పునరుద్ధరణతో పాటు మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూర్చనుందని



ప్రకృతి ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. జీవ వైవిధ్యానికి సరైన చిరునామా అమీన్‌పూర్ చెరువు. రకరకాల పక్షులు, జంతువులకు నిలయం ఇది. ఏకంగా 350 ఎకరాల్లో విస్తరించిన అమీన్‌పూర్ చెరువు.. పెద్దచెరువు, కొత్తచెరువు, కొమ్ముచెరువు అనే మూడు చెరువుల గొలుసుకట్టు. ఇంత పెద్ద చెరువును కబ్జాలకు గురైంది. పెద్ద చెరువు నుంచి తూముల ద్వారా వచ్చే నీటిని సైతం కబ్జాదారులు మూసివేశారు. కొత్త చెరువును దాదాపు ఆనవాళ్లు లేకుండా చేశారు. ఈ మధ్య పెద్ద చెరువుకు సబంధించిన అలుగు, తూములు మూసివేయడంతో వర్షం వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందిపడుతున్నారు అమీన్‌పూర్ వాసులు. దీనికితోడు పశుపక్షాదులకు నిలయమైన అమీన్‌పూర్ వలస పక్షులు అంతరించి పోతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమీన్‌పూర్ చెరువు వద్ద కనిపించిన అరుదైన రెడ్ ఫ్లైక్యాచర్‌కు సంబంధించిన చిత్రాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పర్యావరణ పునరుద్ధరణ కోసం సాగుతోన్న కార్యక్రమాలకు ఇది సాక్ష్యమని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అమీన్ పూర్ చెరువుకు పూర్వవైభవం రావటమే కాకుండా.. జీవ వైవిధ్యం కూడా తిరిగి సంతరించుకుంది. ఇందుకు నిదర్శనమే.. ÷÷-లక్యాచర్ లాంటి అరుదైన జాతి పక్షులు ఇక్కడికి విచ్చేయటమే అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అయితే ఇక మిగిలింది నాలుగేళ్లు.. ఈ కాలంలో చేయదగిన పనులు ఎన్నో ఉన్నాయి. వీటిని ఎలా ఒడ్డిక్కిస్తారన్నది కూడా ముఖ్యమే.

# గజ..గజ..సింగిల్ డిజిట్‌కే పడిపోయిన ఉష్ణోగ్రతలు

## వణుకుతున్న ప్రజలు

**హైదరాబాద్, డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలై.. ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం గజగజ వణికిపోతున్నారు. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పటాన్‌చెరులో 7డిగ్రీలు, మెదక్‌లో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 11.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.



# ఇక్కడ ఎవరూ తెలివి తక్కువ వాళ్ళు లేరు

## రేవంత్, అదానీ బంధం అందరికీ తెలుసు

## : మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

తెలంగాణలో ఎవరూ తెలివి తక్కువ వాళ్లు లేరు, అందరికీ సీఎం రేవంత్‌రెడ్డి, అదానీకి ఉన్న బంధం తెలుసునని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్టుగా.. అదానీకి అన్ని రకాలుగా తోడు నీడగా ఉంటూ ఆయన కోసం కష్టపడుతున్న రేవంత్ రెడ్డి.. నేడు అదానీకి వ్యతిరేక ర్యాలీ ని తీయాలని అనుకుంటున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. జైపూర్‌లో సరిగ్గా అతిథి మర్యాదలు జరగలేదోనో.. ఢిల్లీలో అపాయింట్‌మెంట్ దక్కలేదనో.. మొత్తానికి కొత్త నాటకానికి శ్రీకారం చుట్టాడు మన చిట్టినాయుడు అని కేటీఆర్ విమర్శించారు. భాయ్, భాయ్ అని వందల, వేల కోట్లు పంచుకున్న ముఖ్యమంత్రి.. అదానీ వ్యతిరేక రాలీ తీస్తున్నాడంట అని అన్నారు. నవ్వి పోదురు నాకేటి సిగ్గు అని.. రేవంత్ రెడ్డిని చూసే రాసుంటారని వ్యాఖ్యానించారు. మిమ్మల్ని ఎన్నుకున్నంత మాత్రం ప్రజలు మరీ అంత తెలివి తక్కువ వాళ్ళనుకుంటున్నావా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. లేక మళ్లీ మళ్లీ మోసం చెయ్యచ్చులే అనుకుంటున్నావా అని నిలదీశారు. దొంగే దొంగ అనడం నేడు కామన్ అయిపోయిందని చెప్పారు.



# విద్యార్థులకు జరిగిన నష్టానికి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే : హరీశ్‌రావు

**హైదరాబాద్, డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసిన వారికి స్థానిక కోటా పరిధిలోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్‌లు కల్పించాల్సి ఉంటుందని హైకోర్టు తేల్చిచెప్పడంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు స్పందించారు. మెడికల్ అడ్మిషన్లలో కాంగ్రెస్ ప్రభుత్వం లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బతీస్తాయని తాము ఆనాడే చెప్పామని గుర్తుచేశారు. ఈరోజు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోటా నియమాలను హైకోర్టు రద్దు చేసిందని తెలిపారు. ఎంబీబీఎస్ అడ్మిషన్లు ఆ తప్పుడు నియమాలతో జరిగినందువల్ల వందలాది మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఆయన స్పష్టం చేశారు.



# కొత్త ఏడాదిలో మహాకుంభమేళా

## అఖారాల పర్యవేక్షణతో కఠిన ఆంక్షలు

**అలహాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

కొత్త ఏడాదిలో కుంభమేళా పలకరించబోతున్నది. అయితే ఇక్కడ మార్గదర్శకాలు ఇప్పుడు చ ర్చగా మారాయి. ప్రయాగ్‌రాజ్ లోని మహా కుంభమేళా మరోసారి వార్తల్లో నిలిచింది. కొత్త సంవత్సరంలో జరగనున్న మహా కుంభమేళా లో సనాతనయేతరుల ప్రవేశాన్ని అఖారా పరిషత్ నిషేధించిన తరువాత, ఇప్పుడు నాగ సన్యాసులు కూడా కొత్త మార్గదర్శకాలను వెల్లడించారు. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. సనాతనేతరులు ఎవరైనా మన సంస్కృతితో ఆటలాడినా లేదా జాతర ప్రాంతంలోకి ప్రవేశించినా వారిని పట్టుకుని కఠిన శిక్షలు వేస్తామని స్పష్టం చేశారు. ఈ సమస్యపై తామే చర్యలు తీసుకోగలమని నాగ సన్యాసులు చెబుతున్నారు. ఇంతకు ముందు కూడా సనాతనేతరులు మహాకుంభంలోకి ప్రవేశించకుండా నిషేధం విధిస్తున్నట్లు అఖారా పరిషత్ ప్రకటించింది. ఇప్పుడు నాగ సన్యాసులు.. అఖారా పరిషత్ ప్రకటనకు మద్దతిచ్చి దాన్ని అమలు చేసే దిశగా గట్టి అడుగులు వేశారు. మహా కుంభమేళాలో పాల్గొనే వారు నుదుటిపై తిలకం, మణికట్టుపై కాలవ తప్పనిసరి అని.. సందర్శకుల మహా కుంభమేళా ప్రాంతంలోకి ప్రవేశించడానికి ఇవి ఉన్నవారికి మాత్రమే అనుమతించబడతారని స్పష్టం చేసింది. హిందూ మతాన్ని భ్రష్టు పట్టించే ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నట్లు జునా అఖారాకు చెందిన నాగ సన్యాసి శంకర్ భారతి తెలిపారు. మత స్వచ్ఛతను కాపాడేందుకే ఈ మార్గదర్శకాన్ని అమలు చేశామని చెప్పారు. దీన్ని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఖారాస్‌లోని అన్ని ప్రవేశాల వద్ద పోలీసులను




మోహరింప జేస్తామని.. తాము చేసిన మార్గదర్శకాలను పాటించేలా చూస్తామని నాగ సన్యాసులు చెప్పారు. ఎవరైనా దోషులుగా తేలితే శిక్ష అనుభవించాల్సిందే నని చెప్పారు. అఖారాకు చెందిన మహిళా సన్యాసి దివ్య గిరి ఈ మార్గదర్శకానికి మద్దతు ఇస్తూ మహిళా సన్యాసుల అఖారాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. అఖారా వెలుపల ఒక మహిళా సాధువును ఉంచుతామని వారు వారి నుదిటిపై తిలకం పెట్టుకున్న తర్వాత మాత్రమే లోపలికి అనుమతించనున్నామని చెప్పారు. ఃారతీయ సంస్కృతి త్రివేణీ సంగం పవిత్రతను కాపాడేందుకు ఈ చర్య తీసుకున్నట్లు నాగ సన్యాసులు స్పష్టం చేశారు. నాగ సన్యాసిలు తమ అఖారాలు దీనితో సంబంధం ఉన్న సాధువులు మొత్తం జాతర ప్రాంతాన్ని గమనిస్తారని చెప్పారు.

# కాంగ్రెస్ కార్యకర్తల అత్యుత్సాహం

## ఆగిపోయిన పెళ్లి... పెళ్లి కూతురు తల్లికి గుండెపోటు- మళ్లీ చర్చల ద్వారా జరిగిన పెళ్లి

**గుంటూరు, డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

కాంగ్రెస్ కార్యకర్తల అత్యుత్సాహంతో ఓ యువ ఐపీఎస్ వివాహం పెళ్లిపీటలపై ఆగిపోయింది. దీంతో పెళ్లికుమార్తె తల్లికి గుండెపోటు వచ్చింది. పెళ్లి కొడుకు ఇంటిముందు పెళ్లికూతురు బంధువులు ఆందోళన చేయగా.. చివరకు ఐపీఎస్ పెళ్లికి అంగీకరించాడు. గుంటూరు నగరానికి చెందిన ఐపీఎస్ అధికారితో తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కుమార్తెతో పెళ్లి నిశ్చయించారు. దీంతో డిసెంబర్ 17న సాయంత్రం గుంటూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పెళ్లికి ఏర్పాట్లు చేశారు. అయితే ఈ పెళ్లి వేడుకకు తెలంగాణ నుంచి భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు గుంటూరుకు తరలివచ్చారు. ఆ క్రమంలో పెళ్లి కుమారుడు ఇంటి నుంచి కాంగ్రెస్ జెండాలతో భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లేందుకు నాయకులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం మంచిది కాదని పార్టీ కేడర్‌ను ఐపీఎస్ బంధువులు వారించారు. అందుకు వధువు తరఫు బంధువులు ససేమిరా అన్నారు. ఈ నేపథ్యంలో వరుడు ఐపీఎస్ అధికారి కావడంతో.. పార్టీ జెండాలు మంచిది కాదంటూ.. పెళ్లి కుమార్తె బంధువులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ వధువు బంధువులు అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో యువ ఐపీఎస్ అధికారి ఆగ్రహం కట్టలు తెంచుకొంది. ఈ పెళ్లి చేసుకొనేందుకు ఐపీఎస్ అధికారి నిరాకరించాడు. ఈ విషయం తెలిసి.. పెళ్లి కుమార్తె తల్లికి తీవ్ర గుండెపోటు వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కేడర్.. ఐపీఎస్ అధికారి నివాసం వద్ద ఆందోళన చేపట్టింది. ఈ ఆందోళనపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. ఐపీఎస్



అధికారిని వివాహానికి ఒప్పించేందుకు.. చర్చి పెద్దలు, పాస్టర్లు చర్యలు చేపట్టారు. గత అర్ధరాత్రి 12.00 గంటల నుంచి బుధవారం ఉదయం 7.00 గంటల వరకు చర్చలు జరిగాయి. చివరకు ఈ చర్చలు ఫలప్రదమయ్యాయి. బుధవారం.. అంటే ఈ రోజు సాయంత్రం.. అదే వివాహ వేదికగా పెళ్లి ముహూర్తం ఇరు వర్గాల పెద్దలు కలిసి నిశ్చయించారు. ఈ ఐపీఎస్ అధికారి గుజరాత్ కేడర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అదీకాక.. జిల్లాలో సదరు కాంగ్రెస్ నాయకుడికి భారీగా కేడర్ ఉంది. దీంతో తమ నాయకుడు కుమార్తె వేడుకకు వారంతా గుంటూరు తరలి వచ్చారు.

# రాష్ట్ర వ్యాప్తంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

### కనిష్ఠ స్థాయికి పడిపోతున్న పరిస్థితి

### మరో రెండు రోజులపాటు అధికంగా చలి తీవ్రత


**హైదరాబాద్, డిసెంబర్ 18(తెలంగాణ వీణ):**

తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలవుతుంది. ఇక ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే గజగజ వణికిపోతున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న చల్లటి గాలుల వల్ల రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతున్నాయి. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్ర అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజుల పాటు చలి తీవ్రత ఇదే మాదిరి ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మెదక్, సంగారెడ్డి, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోతాయని, ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చాలా చోట్ల 7 డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పటాన్‌చెరులో 7 డిగ్రీలు, మెదక్‌లో 7.5 చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, ఉదయం వేళల్లో పొగమంచు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఉపరితల ఈశాన్య దిశలో చలిగాలులు గంటకు 2 నుంచి 6 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ లో కనిష్ఠ ఉష్ణోగ్రత 11.9 డిగ్రీల సెల్సియస్ నమోదు అయినట్లు వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 65 శాతంగా పేర్కొన్నారు. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# అసెంబ్లీ ముందు డ్రంకన్‌డ్రైవ్ టెస్టులు పెట్టాలి : హరీశ్‌రావు

**హైదరాబాద్,డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు.



# కేంద్ర మంత్రి ప్రయాణిస్తున్న విమానం దారి మళ్లింపు

**అమరావతి,డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

కేంద్ర రక్షణ సహాయ మంత్రి సంజయ్‌సేథ్ ప్రయాణిస్తున్న విమానానికి వాతావరణం అనుకూలించకపోవడంతో ముందు జాగ్రత్తగా విమానాన్ని హైదరాబాద్‌కు దారి మళ్లించారు. నౌకాదళం హైడ్రో గ్రాఫిక్ సర్వేల కోసం ఉద్దేశించిన ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌకను విశాఖ నావెల్ డాక్ యార్డ్‌లో ఉదయం జరగనున్న కార్యక్రమానికి జాతికి అంకితం చేసే కార్యక్రమానికి ఆయన విమానాశ్రయంలో బయలు దేరారు. విమానంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో విమానాన్ని దారి మళ్లించడంతో కార్యక్రమాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేశారు. కోల్?కత్తాలోని జీఆర్ఎస్ఈలో దేశీయంగా 80 శాతం పరికరాలతో ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌక నిర్మాణం జరిగింది. 110 మీటర్ల పొడవు, 3800 టన్నుల బరువైన ఈ నౌకను రెండు ఇంజిన్లతో రూపకల్పన చేశారు. అత్యాధునిక హైడ్రో గ్రాఫిక్, ఓషనో గ్రాఫిక్ సర్వే పరికరాలతో ఈ నిర్దేశక్?ను తీర్చిదిద్దారు. హైడ్రోగ్రాఫిక్ సర్వేలకు సంబంధించిన రెండో నౌక ఇదే కావడం గమనార్హం. గతంలో 32 ఏళ్ల పాటు భారత నౌకాదళంలో సేవలందించి 2014లో వీడ్కోలు తీసుకున్న నిర్దేశక్ స్థానంలో ఈ కొత్త నౌక రూపుదిద్దుకుంది. 25 రోజుల పాటు నిరంతరాయంగా 18 నాట్ల గరిష్ట వేగంతో ప్రయాణించడం ఈ నౌక ప్రత్యేకత అని నౌక అధికారులు తెలిపారు.



# ప్రిన్సిపాల్ వైఖరి వల్ల విద్యార్థికి తీవ్ర గాయాలు

**యాదాద్రి, డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాల లో దారుణం చోటుచేసుకుంది. ప్రిన్సిపాల్ వంటవాళ్లకు బదులుగా విద్యార్థులను వంటపనికి వినియోగించడంతో ఓ విద్యార్థి ఒంటిపై వేడి నూనె పడింది. ఈ ఘటనలో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. సర్వేల్ గురుకుల పాఠశాలలో వంట మనుషులు సరిపడా లేకపోవడంతో విద్యార్థులను వంటపనికి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో 8వ తరగతి విద్యార్థి వంట చేస్తూ వేడి నూను మీద పడేసుకున్నాడు. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గు

## పార్లమెంట్ ఆవరణ ముందు అంబేడ్కర్ చిత్రాలతో నిరసన

**న్యూఢిల్లీ,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలంటూ ప్రతిపక్ష కూటమి ఇండియా బ్లాక్ బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా పలువురు ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటాలతో చేబూని, జై భీమ్, అమిత్‌షా క్షమాపణలు చెప్పాల్సిందే అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఆర్‌జెడి, డిఎంకె, ఆప్ పార్టీలు ఆందోళన చేపట్టాయి. మనుస్మృతిని విశ్వసించే వారు అంబేద్కర్‌తో విభేదిస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా అమిత్‌షాపై విరుచుకుపడ్డారు. హోం మంత్రి బాబాసాహెబ్‌ను అవమానించడం ద్వారా బిజెపి-ఆర్ఎస్ఎస్ జాతీయ పతాకానికి వ్యతిరేకమని, వారి పూర్వీకులు ఆశోక చక్రాన్ని వ్యతిరేకించారని మరోసారి రుజువైంది. భారత రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని తొలిరోజు నుండే అమలు చేయాలని సంఘ్‌పరివార్ భావిస్తోందని అన్నారు. 'నాలాంటి కోట్లాది మంది ప్రజలకు అంబేద్కర్ భగవంతుడి కంటే తక్కువేమీ కాదు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు , పేదలకు ఆయన ఎప్పటికీ గొప్పవాడేనని బిజెపి నేతలు అర్థం చేసుకోవాలి' ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు.

మంగళవారం రాజ్యసభలో చర్చ నేపథ్యంలో అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతోన్న సంగతి తెలిసిందే. హోంమంత్రి వ్యాఖ్యలను విపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అంబేద్కర్ చిత్రాలు ప్రదర్శిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో ఎంపీలు నిరసన తెలిపారు. అలాగే అమిత్ షా రాజీనామాను డిమాండ్ చేశాయి. ఆ నిరసనల్లో రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు.









## రాజస్తాన్‌లో మందుగుండు పేలుడు

# ఇద్దరు జవాన్లు మృతి

**జైపూర్,డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

రాజస్థాన్ బికనీర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మందగుండు పేలడంతో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ నార్త్ క్యాంప్ ఆర్టిలరీ ప్రాక్టీస్ సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకున్నది. ఈ పేలుడులో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో సైనికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే సూరత్‌గఢ్‌లోని మిలటరీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సైనిక విన్యాసాల జరుగుతున్న ఫైరింగ్ రేంజ్‌లోని చార్లీ సెంటర్‌లో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న సైనికాధికారులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. మహాజన్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ కశ్యప్ సింగ్ ప్రమాదాన్ని ధ్రువీకరించారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ లో ఆర్మీ ప్రాక్టీస్ కొనసాగుతోందని కశ్యప్ సింగ్ తెలిపారు. ట్యాంక్‌లోకి మందుగుండును ఎక్కిస్తున్న సమయంలో పేలుడు చోటు చేసుకున్నది. మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో వారం వ్యవధిలో సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఇది రెండో ఘటన. ఈ నెల 15న ట్రైనింగ్ సమయంలో ఓ సైనికుడు వీరమణం పొందాడు. చంద్ర ప్రకాష్ పటేల్ టోయింగ్ వాహనానికి తుపాకీని అటాచ్ చేస్తున్నప్పుడు, తుపాకీ గన్ మౌంట్ ర్యాంప్‌పై ట్రాక్షన్ కోల్పోయి వెనుక్కు జారింది. దాంతో జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఫీల్డ్ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు అప్పటికే చనిపోయినట్లుగా తెలిపారు.



# పంజాబీ రైతుల రైల్ రోకో

**చండీఘడ్, డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

పంజాబీ రైతులు రైల్ రోకో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఛలో ఢిల్లీ ప్రయత్నం విఫలం కావడంతో.. ఆ రైతులు ఇప్పుడు రైళ్లను ఆపేస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు రైళ్లను నిలిపివేశారు. రాష్ట్రంలోని అనేక మార్గాల్లో మూడు గంటల పాటు రైల్ రోకో నిర్వహించారు. పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. సంయుక్త కిసాన్ మోర్చాతో పాటు కిసాన్ మజ్దూర్ మోర్చాలు రైల్ రోకో నినాదాన్ని ఇచ్చాయి. రైల్వే ట్రాకులపై రైతులు బైఠాయించినట్లు కిసాన్ మజ్దూర్ మోర్చా నేత సర్వాన్ సింగ్ పందేర్ తెలిపారు. ఢిల్లీ మార్చును అడ్డుకోవడంతో ఫిబ్రవరి 13వ తేదీ నుంచి శంభూ, కన్నౌరి బోర్డర్ల మధ్య రైతులు ధర్నా చేపడుతున్న విషయం తెలిసిందే. కన్నౌరు బోర్డర్ పాయింట్ వద్ద పంజాబీ రైతు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ దీక్ష చేపడుతున్నారు. పంటలకు ఎంఎస్పీ ఇవ్వాలని కేంద్రాన్ని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 101 మంది రైతులు డిసెంబర్ 6,8, 14వ తేదీల్లో ఢిల్లీలో ప్రవేశించేందుకు ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలను హర్యానా భద్రతా దళాలు అడ్డుకున్నాయి. పంటలకు ఎంఎస్పీతో పాటు రుణమాఫీ, పెన్షన్, విద్యుత్తు ధరల తగ్గింపు, పోలీసు కేసులు ఎత్తివేత లాంటి డిమాండ్లపై రైతులు పోరాడుతున్నారు.




# జమ్ముకశ్మీర్‌లో అగ్ని ప్రమాదం..

# ఆరుగురి మృతి

**శ్రీనగర్, డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

జమ్ముకశ్మీర్‌లోని కథువాలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శివనగర్‌లోని ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇల్లంతా దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఊపిరాడక ఆరుగురు మరణించారు. మరో ముగ్గురు అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వారిని చికిత్స నిమిత్తం కథువాలోని జీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, అగ్ని ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేసే ప్రయత్నం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఇంటికి మంటలు అంటుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.



# స్పీకర్‌కు బీఆర్ఎస్ నేతల లేఖ

**హైదరాబాద్, డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో అసెంబ్లీలో చర్చకు అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్ లేఖ రాశారు. గత కొద్ది రోజులుగా ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొద్దినెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుపై అనేక నిరాధార ఆరోపణలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంపై ఈ వారం జరిగిన కేబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ జరిగినట్లుగా వార్తలు వచ్చాయని.. గవర్నర్ ఆమోదం వచ్చిందంటూ సీఎం కార్యాలయం నుంచి రకరకాల లీకులు మీడియాకు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై నాలుగు గోడల మధ్య చర్చ కన్నా శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలేంటో అందరికీ తెలుస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా- ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకుందని.. ఈ రేస్తో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల లబ్ధి చేకూరినట్లుగా నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసిందని పేర్కొన్నారు. 2024లో మరో దఫా రేస్ జరగాల్సి ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని ఆరోపించారు. అప్పటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. నిజానికి ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగిందని.. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయని కేటీఆర్ వివరించారని తెలిపారు. అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉందని.. శాసనసభలో ఈ అంశంపై చర్చకు అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసన సభ వేదికగా చెబుదామని.. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగున్నందున అనుకూలమైన రోజే చర్చ పెట్టాలని కోరుతున్నామన్నారు. ఈ అంశంపై శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయన్నారు.

# టీజీ టెట్ 2024 పరీక్షల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్,డిసెంబర్ 18 (తెలంగాణ వీణ):**

టీజీ టెట్2024 పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. జనవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు 20 సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లు అంటే సెషన్ 1 ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, సెషన్ -2 మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పేపర్-1 పరీక్షలను జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. పేపర్ -2 పరీక్షలను జనవరి 2, 5, 11, 12, 19, 20వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 2వ తేదీన ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో సోషల్ స్టడీస్(పేపర్-2) పరీక్ష నిర్వహించనున్నారు. జనవరి 5న ఉదయం సెషన్‌లో సోషల్ స్టడీస్(పేపర్ -2), మధ్యాహ్నం సెషన్‌లో మ్యాథమేటిక్స్ అండ్ సైన్స్(పేపర్-2) పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# అరెస్ట్ కోసం కెటిఆర్ తహతహ

## ఎంపి చామల హాట్ కామెంట్స్

**హైదరాబాద్, డిసెంబర్18(తెలంగాణ వీణ):**

ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైందని.. మరో రెండు, మూడు రోజుల్లో పోలీసులు ఆయనను అరెస్ట్ చేస్తారని తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేటీఆర్ అరెస్ట్‌పై అధికార కాంగ్రెస్ పార్టీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడు అరెస్టు చేస్తారని కేటీఆర్ ఎదురు చూస్తున్నాడు.. ఆయనకు అరెస్టు కావాలనే ఇంట్రెస్ట్ చాలా ఎక్కువగాప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని ఫైర్ అయ్యారు. ప్రభుత్వం మీద విష ప్రచారం చేస్తూ కేసులు పెట్టించుకోవాలనే భావనలో ఆయన ఉన్నారని.. అరెస్టయి ట్రెండింగ్‌లోకి రావాలని కేటీఆర్ భావిస్తున్నట్టు ఉన్నాడన్నారు. ఎవరైనా సరే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు.


# ఎఫ్‌డిసి చైర్మన్‌గా దిల్‌రాజ్ బాధ్యతలు

## అభినందనలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా దిల్‌రాజు బుధవారం ఉదయం పదవీ భాద్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ లోని ఎఫ్.డీ.సి కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పదవీ భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై దిల్ రాజ్ ను అభినందించారు. తెలంగాణా లో ఫిలిం ఇండస్ట్రీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఇండస్ట్రీకి చెందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వడంలో దిల్ రాజు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయాని ఈ సందర్భంగామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ కి చెందిన షూటింగ్స్ తెలంగాణా లో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని కృషి చేస్తానని దిల్ రాజ్ పేర్కొన్నారు.





# నెల్లూరు జిల్లాలో బాలుడికి జికా వైరస్

## వ్యాధి నిర్ధారణ కోసం పూణెకు బ్లడ్ శాంపిల్స్: ఆనం

**నెల్లూరు,డిసెంబర్18(తెలంగాణ వీణ):**

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం రేపుతోంది. ఈ ఘటనపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలుడికి జికా వైరస్ సోకినట్లు ప్రచారం జరిగింది. మంత్రి ఆదేశాలతో జికా వైరస్ అనుమానాలపై జిల్లా యంత్రాంగం స్పందించింది. 'అనారోగ్యానికి గురైన బాలుడికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. కార్పొరేట్ వైద్యం కోసం చెన్నై తరలించాం. వ్యాధి నిర్ధరణ కోసం బాలుడి బ్లడ్ శాంపిల్స్‌ను అధికారులు పుణే ల్యాబ్‌కు పంపించారు. జీజీహెచ్ వైద్యులతో పాటు వెంకటాపురం గ్రామానికి ప్రత్యేక వైద్య బృందాలు వెళ్లాయి.

GS9 TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

# చరిత్ర సృష్టించిన జస్‌ప్రీత్ బుమ్రా..




## హెడ్‌ను తగిన బుద్ధి చెప్పిన ఆకాష్‌దీప్..

గబ్బా వేదికగా జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో టీమ్ ఇండియా బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఆకాశ్‌దీప్ చేసిన పని వ్యాఖ్యాతలను కూడా నవ్వించేలా చేసింది. బ్యాటింగ్ చేస్తున్న భారత ఫాస్ట్ బౌలర్ ఆకాశ్‌దీప్.. పక్కనే ఉన్న ట్రావిస్ హెడ్‌కి బంతి ఇవ్వకుండా మైదానంలో పడేశాడు. దీనికి ట్రావిస్ హెడ్ కోపంగా చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత, ఆకాష్ అలెక్స్ కారీకి సారీ చెప్పడం కనిపించింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న గబ్బా టెస్టు ఐదో రోజు తొలి సెషన్‌లో ఈ దృశ్యం కనిపించింది. టీమిండియా తొమ్మిది వికెట్లు కోల్పోయింది. జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్‌దీప్ చివరి వికెట్‌గా క్రీజులో ఉన్నారు. ఆకాష్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో.. ఓ బంతిని ఆడడం మిస్ అయ్యాడు. ఆ బంతి బ్యాట్‌కు తగిలి ప్యాడ్‌లో ఇరుక్కుపోయింది. సమీపంలో ఫీల్డింగ్ చేస్తున్న హెడ్ ఆకాష్ బంతిని తీసుకోవడానికి వచ్చాడు. ఆకాష్ ప్యాడ్ నుంచి బంతిని తీసివేస్తున్న సమయంలో.. ఆపై హెడ్ బంతిని అడిగాడు. కానీ, బంతిని హెడ్‌కి ఇవ్వకుండా, ఆకాష్ దానిని నేలపై విసిరాడు. ఆ తర్వాత, హెడ్ అతని వైపు చూస్తూ, బంతిని స్వయంగా తీయడం ప్రారంభించాడు. అప్పుడు ఆకాష్ వికెట్ కీపర్ అలెక్స్ కారీకి 'ఐ యామ్ సారీ' అని చెప్పుకొచ్చాడు. ఈ ఫన్నీ సంఘటన చూసి వ్యాఖ్యాతలు కూడా నవ్వడం మొదలుపెట్టారు. ఆ తర్వాత హెడ్ కూడా నవ్వుతూ కనిపించాడు. ఈ ఫన్నీ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా లైక్ అవుతోంది.




## రోహిత్ శర్మ కూడా రిటైర్‌మెంట్ ప్రకటించనున్నాడా?

ఆస్ట్రేలియా పర్యటనలో మళ్లీ గతంలో జరిగిన డ్రామానే కొనసాగుతోంది. తాజా రవిచంద్రన్ అశ్విన్ రిటైర్‌మెంట్ ప్రకటించగా.. త్వరలోనే అతడి బాటలోనే రోహిత్ శర్మ పయనించే అవకాశం ఉంది. 2014లో బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో జరిగిన పరిణామాలే ఇక్కడ చోటుచేసుకుంటుండడం గమనార్హం. 2014లో ఆస్ట్రేలియాలో చోటుచేసుకున్న పరిణామాలు తాజాగా పునరావృతమవుతున్నాయి. భారత జట్టులోని కీలక ఆటగాళ్లు క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతారని చర్చ జరుగుతోంది. ఇలా చర్చ జరుగుతున్న క్రమంలోనే సీనియర్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ క్రికెట్‌కు బై బై చెప్పేశాడు. ఇక తర్వాత రోహిత్ శర్మనే చర్చ నడుస్తోంది. కెప్టెన్‌గా వరుసగా 5 టెస్టుల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన రోహిత్ శర్మ ప్రస్తుతం కష్టాలు ఎదుర్కొంటున్నాడు. మహేంద్ర సింగ్ ధోని మాదిరి హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ కూడా బోర్డర్-గవాస్కర్ సిరీస్ మధ్యలో టెస్ట్ కెప్టెన్సీ నుంచి రాజీనామా ప్రకటించవచ్చనే వార్తలు వస్తున్నాయి. తన వ్యూహం ఫలించనప్పుడు కెప్టెన్‌గా కొనసాగడంలో అర్థం లేదని 2014 ఆస్ట్రేలియా పర్యటనలో కెప్టెన్ ఎంఎస్ ధోనీ కూడా తన సారథ్య బాధ్యతల నుంచి వైదొలిగాడు. అంతేకాకుండా టెస్ట్ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలికాడు. ఆడిలైడ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ రెండో టెస్టులో రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా ఓటమి పాలైంది. పెర్త్ వేదికగా జస్ప్రీత్ బుమ్రా సారథ్యంలో జరిగిన తొలి టెస్టులో టీమిండియా విజయం సాధించింది. ఆడిలైడ్‌లో జరిగిన పింక్ బాల్ టెస్టులో ఓటమి తర్వాత రోహిత్ కెప్టెన్సీపై సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రతి టెస్టు ఓటమికి రోహిత్‌పైనే విమర్శలు వస్తున్నాయి. వరుసగా 4 టెస్టు మ్యాచ్‌ల్లో ఓడిన మూడో భారత కెప్టెన్‌గా రోహిత్ నిలిచాడు. మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ 1967-68లో కెప్టెన్‌గా వరుసగా 6 టెస్టు మ్యాచ్‌ల్లో ఓడిన భారత కెప్టెన్‌గా చెత్త రికార్డు ఉంది. టెస్టు మ్యాచ్‌లో కెప్టెన్‌గా విఫలమైన జాబితాలో సచిన్ టెండూల్కర్ 2వ స్థానంలో ఉన్నాడు. 1999-2000లో భారత కెప్టెన్‌గా సచిన్ వరుసగా ఐదు టెస్టు మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. దత్తా గైక్వాడ్ (1959), ఎంఎస్ ధోని (2011 మరియు 2014), విరాట్ కోహ్లీ (2020-21), రోహిత్ శర్మ (2024) వరుసగా 4 ఓటములతో మూడో స్థానంలో నిలిచారు.



టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను బుమ్రా అధిగమించాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో జస్‌ప్రీత్ బుమ్రా ఈ ఫీట్ సాధించాడు. ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా(8), మార్నస్ లబుషేన్(1)లను ఔట్ చేయడం ద్వారా బుమ్రా ఈ ఘనతను అందుకున్నాడు. ఖవాజాను స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేసిన బుమ్రా.. మార్నస్ లబుషేన్‌ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆసీస్ గడ్డపై కపిల్ దేవ్ 11 టెస్ట్‌ల్లో 51 వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా 10 టెస్ట్‌ల్లో 52 వికెట్లు తీసి ఈ ఫీట్ సాధించాడు. ఈ జాబితాలో బుమ్రా, కపిల్ దేవ్ తర్వాత అనిల్ కుంబ్లే(49), రవిచంద్రన్ అశ్విన్(40), బిషన్ సింగ్ బేడీ(35) ఉన్నారు. ఇరు జట్ల మధ్య జరిగిన టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు తీసిన ఘనత మాత్రం ఆసీస్ స్పిన్నర్ నాథన్ లయన్ పేరిట ఉంది. నాథన్ లయన్ 18 టెస్ట్‌ల్లో 63 వికెట్లు తీసాడు. అతనికి చేరువగా అశ్విన్ ఉన్నాడు. ఇక గబ్బా టెస్ట్ అనేక మలుపులు తిరుగుతోంది. ఓవైపు వర్షం.. మరోవైపు భారత బౌలర్ల అసాధారణ ప్రదర్శన అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. టెయిలెండర్ల అసాధారణ బ్యాటింగ్‌తో ఫాలో ఆన్ గండం గట్టెక్కిన భారత్.. బౌలింగ్‌లో నిప్పులు చెరుగుతోంది. జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్, సిరాజ్ కట్టుదిట్టంగా బంతులు వేయడంతో ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 33 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో నాథన్ మెక్‌స్వీనీ(4), ఉస్మాన్ ఖవాజా(8), మార్నస్ లబుషేన్(1), మిచెల్ మార్ష్(2), స్టీవ్ స్మిత్(4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. క్రీజులో ట్రావిస్ హెడ్(13 బ్యాటింగ్)తో పాటు అలెక్స్ క్యారీ(6 బ్యాటింగ్) ఉన్నారు. భారత బౌలర్లలో బుమ్రా, ఆకాశ్ దీప్ రెండేసి వికెట్లు తీయగా.. సిరాజ్ ఓ వికెట్ పడగొట్టాడు.

## నేను జస్సీ భాయ్‌ని మాత్రమే నమ్ముతాను

### సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు

ఆస్ట్రేలియాతో జరిగిన బ్రిస్బేన్ టెస్ట్‌లో విలేఖరి ప్రశ్నకు జస్ప్రీత్ బుమ్రా చమత్కార సమాధానం నెట్టింట్లో వైరల్ అయింది. 2022లో బుమ్రా ఒక టెస్ట్ ఓవర్‌లో 35 పరుగులు చేసిన ఘనతను గుర్తుచేస్తూ, "నా బ్యాటింగ్ గురించి గూగుల్ చూడండి" అని చమత్కరించాడు. బుమ్రా తన అద్భుతమైన ప్రదర్శనతో జట్టుకు కీలకమైన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియాలో భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మూడో టెస్ట్ మ్యాచ్ బ్రిస్బేన్‌లో మూడో రోజు ముగిసిన తర్వాత జస్ప్రీత్ బుమ్రా అందించిన సమాధానం నెట్టింట్లో విపరీతంగా వైరల్ అయ్యింది. విలేఖరి అడిగిన ఒక గమ్మత్తైన ప్రశ్నకు బుమ్రా చమత్కారమైన సమాధానం ఇవ్వడమే ఇందుకు కారణం. జస్ప్రీత్, మీ బ్యాటింగ్ సామర్థ్యం గురించి, గబ్బా పరిస్థితులలో జట్టు పరిస్థితి గురించి మీ అభిప్రాయం ఏంటి అని ఒక విలేఖరి ప్రశ్నించాడు. దీనికి బుమ్రా నవ్వుతూ "మీరు నా బ్యాటింగ్ సామర్థ్యాన్ని ప్రశ్నిస్తున్నట్లుగా అనిపిస్తోంది. నా బ్యాటింగ్ రికార్డు గురించి తెలుసుకోవాలంటే మీరు గూగుల్ ని అడగండి. ఒక టెస్ట్ ఓవర్‌లో ఎవరు ఎక్కువ పరుగులు సాధించారో చూడండి" అని బుమ్రా సమాధానం ఇచ్చారు. ఆ సమాధానం వెనుక అర్థం స్పష్టమైనది %-% 2022లో ఇంగ్లండ్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ బౌలింగ్‌లో బుమ్రా ఒకే ఓవర్లో 35 పరుగులు చేసి, టెస్ట్ క్రికెట్‌లో ఒక రికార్డు సృష్టించాడు. బుమ్రా చమత్కారం అంతటితో ఆగలేదు. ఈ సందర్భాన్ని గూగుల్ ఇండియా కూడా లైట్‌గా తీసుకుని %శ% (మాజీ ట్విట్టర్)లో స్పందించింది. గూగుల్ ఇండియా ఒక వీడియో క్లిప్ పోస్ట్ చేస్తూ "నేను జస్సీ భాయ్‌ని మాత్రమే నమ్ముతాను" అని రాసింది. అయితే, కేవలం చమత్కారాలకు మాత్రమే పరిమితం కాకుండా, బుమ్రా తన ప్రదర్శనతో భారత జట్టుకు ఎంత నిస్వార్థంగా సహాయం చేస్తున్నాడో మరోసారి చూపించాడు. బ్రిస్బేన్ టెస్ట్‌లో 18 వికెట్లతో టెస్ట్ సిరీస్‌లో అతను వికెట్ తీయడం కొనసాగిస్తూ అగ్రస్థానంలో నిలిచాడు. ప్రతి మ్యాచ్‌లో సవాళ్లను ఎదుర్కొంటూ, పరిస్థితులను అర్థం చేసుకొని తన బౌలింగ్‌ను మెరుగుపరుచుకోవడం బుమ్రా ప్రత్యేకతగా చెప్పుకోవాలి. జస్ప్రీత్ బుమ్రా ఇలా కేవలం ఒక బౌలర్‌గా మాత్రమే కాకుండా, ఆపత్కాలంలో జట్టును నిలబెట్టే ఆటగాడిగా మారాడు. ప్రతిసారి తన ప్రదర్శనతో జట్టును ముందుండి నడిపే బుమ్రా, భారత జట్టుకు నిజమైన ఆస్తిగా కొనసాగుతున్నాడు. అతని చమత్కారాలు, అద్భుతమైన ఆటతీరు అభిమానులకు ఎప్పటికీ ఆనందం తెచ్చేలా ఉన్నాయి.

## అశ్విన్ సంచలన నిర్ణయం

### అంతర్జాతీయ క్రికెట్‌కు అశ్విన్ గుడ్‌బై! - అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు

టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం అశ్విన్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. మ్యాచ్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న అశ్విన్.. తన 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. ఈ సమయంలో అశ్విన్ కాస్త భావోద్వేగానికి గురయ్యాడు. "అంతర్జాతీయ స్థాయిలో అన్ని ఫార్మాట్లలో భారత క్రికెటర్‌గా ఇదే నా చివరి రోజు. ఒక క్రికెటర్‌గా నాలో ఇంకా కొంచెం శక్తి ఉంది. అయితే అది క్లబ్ స్థాయి క్రికెట్‌లో ఉపయోగించుంటా. నేను చాలా సరదాగా గడిపాను. రోహిత్ శర్మతోపాట సహచరుల అందరితో మంచి జ్ఞాపకాలు ఉన్నాయి. కొద్దిరోజులుగా కొందరు సహచరులను మిస్ అయ్యాను. నేను కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన వ్యక్తులు చాలా మంది ఉన్నారు. ఈ క్రికెట్ ప్రయాణంలో భాగమైన కోచ్‌లందరూ, ముఖ్యంగా రోహిత్, విరాట్, అజింక్యా, పుజారా అద్భుతమైన క్యాచ్‌లను అందుకుని.. నాకు వికెట్ల సంఖ్యను అందించారు. అలాగే గట్టి పోటీదారుగా ఉన్న ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు ధన్యవాదాలు. నేను ఆసీస్‌తో మ్యాచ్‌లను ఎంతో ఎంజాయ్ చేశాను." అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. పెర్త్ టెస్ట్ విజయం తర్వాతే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాలనుకున్నాడని, కానీ తానే పింక్ బాల్ టెస్ట్ ఆడేలా కన్విన్స్ చేసానని కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. అశ్విన్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నామని, తదుపరి రెండు టెస్ట్‌లు అతను ఆడడని వెల్లడించాడు. గురువారమే అశ్విన్ స్వదేశానికి వెళ్లిపోతాడని స్పష్టం చేశాడు. 2010 శ్రీలంక పర్యటనలో హరారే వేదికగా జరిగిన వన్డే మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన అశ్విన్.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌తో చివరి మ్యాచ్ ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి అశ్విన్ 765 వికెట్లు తీసాడు. టెస్ట్‌ల్లో 106 మ్యాచ్‌ల్లో 2.83 ఎకానమీతో 537 వికెట్లు పడగొట్టాడు. ఇందులో 5 వికెట్ల ఘనతను 37 సార్లు అందుకున్నాడు. 116 వన్డేల్లో 4.93 ఎకానమీతో 156 వికెట్లుత తీసాడు. 65 టీ20ల్లో 6.90 ఎకానమీతో 72 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 4, 400 పరుగులు చేశాడు. 106 టెస్ట్‌ల్లో 25.75 సగటుతో 3503 పరుగులు చేసిన్ అశ్విన్.. 6 సెంచరీలతో పాటు 14 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. అంతకుముందు డ్రెస్సింగ్ రూమ్‌లో విరాట్ కోహ్లీతో అశ్విన్ భావోద్వేగానికి గురైన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

| | | | | |
|---|---|---|---|---|
| 1 | ముత్తయ్య మురళీధరన్ (శ్రీలంక) | 133 | 230 | 800 |
| 2 | షేన్ వార్న్ (ఆస్ట్రేలియా) | 145 | 273 | 708 |
| 3 | జేమ్స్ ఆండర్సన్ (ఇంగ్లండ్) | 188 | 350 | 704 |
| 4 | అనిల్ కుంబ్లే (ఇండియా) | 132 | 236 | 619 |
| 5 | స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లండ్) | 167 | 309 | 604 |
| 6 | గ్లెన్ మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా) | 124 | 243 | 563 |
| 7 | రవిచంద్రన్ అశ్విన్ (ఇండియా) | 106 | 200 | 537 |
| 8 | నాథన్ లియోన్ (ఆస్ట్రేలియా) | 132 | 246 | 533 |
| 9 | కోర్ట్నీ వాల్ష్ (వెస్టిండీస్) | 132 | 242 | 519 |
| 10 | డేల్ స్టెయిన్ (సౌతాఫ్రికా) | 93 | 171 | 439 |



## ఆసక్తిగా ప్లే ఆఫ్స్ సమరం

### హర్యానాపై యూపీ యోధాస్ విజయం-తెలుగు టైటాన్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం

### ఏడో స్థానానికి పడిపోయిన తెలుగు టైటాన్స్



ప్రోకబడ్డీ ప్రీమియర్ లీగ్(పీకేఎల్) సీజన్ 11 తుది దశకు చేరుకుంది. ఒక్కో మ్యాచ్ ఫలితంతో ప్లే ఆఫ్స్ సమరం ఆసక్తిగా మారుతోంది. ఇప్పటికే హర్యానా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. మరో రెండు స్థానాల కోసం యూపీ యోధాస్, పట్నా పైరేట్స్, జైపూర్ పింక్ పాంథర్స్, యు ముంబా, తెలుగు టైటాన్స్ పోటీ పడుతున్నాయి. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ యోధాస్ 31-24తో టేబుల్ టాపర్ హర్యానా స్టీలర్స్‌ను ఓడించి తమ ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. 20 మ్యాచ్‌ల్లో 11 విజయాలు, 3 టైలతో మూడో స్థానంలో నిలిచిన యూపీ యోధాస్.. ప్లే ఆఫ్స్‌కు మరో అడుగు దూరంలో నిలిచింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో యూపీ తరఫున భవానీ రాజ్‌పుత్(11) సత్తాచాటాడు. ఫస్టాఫ్‌లో ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. హర్యానాను ఆలౌట్ చేసిన యూపీ యోధాస్ 15-13 తేడాతో ఆధిక్యం సాధించింది. సెకండాఫ్‌లో మరింత జోరు కనబర్చిన యూపీ యోధాస్.. మరోసారి హర్యానాను ఆలౌట్ చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. హర్యానా తరఫున విశాల్, వినయ్ 6 పాయింట్స్‌తో రాణించారు. యూపీ యోధాస్ విజయంతో తెలుగు టైటాన్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. యూపీ యోధాస్ విజయంతో తెలుగు టైటాన్స్ 6వ స్థానం నుంచి ఏడో స్థానానికి పడిపోయింది. తెలుగు టైటాన్స్ 20 మ్యాచ్‌ల్లో 11 విజయాలు సాధించింది. మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ప్లే ఆఫ్స్ చేరాలంటే ఈ మూడింటికి మూడు గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు మ్యాచ్‌లు గెలిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. నేడు తెలుగు టైటాన్స్ పట్నా పైరేట్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. మంగళవారం జరిగిన మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 35-26 తేడాతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. ఈ గెలుపుతో జైపూర్ ప్లే ఆఫ్స్ అవకాశాలు కూడా మెరుగయ్యాయి.



# అచితూచి సంయుక్త మీనన్ సినిమాలు

ఇండస్ట్రీలో 90శాతం సక్సెస్ రేట్ ఉన్న కథానాయిక సంయుక్త మీనన్. రాశి కన్నా వాసి ముఖ్యమన్నట్టు ఆచితూచి సినిమాలను ఎంచుకుంటూ ముందుకెళ్తున్నది ఈ మలయాళ మందారం. ప్రస్తుతం సౌత్‌లో అన్ని భాషలూ కలిపి ఓ అరడజను సినిమాలు ఈ అమ్మాయి చేతిలో ఉన్నాయి. ఇదిలావుంటే.. ఇటీవలే ఓ తెలుగు సినిమాకు ఈ ముద్దుగుమ్మ పచ్చజెండా ఊపేసిందట. పైగా అది లేడీ ఓరియెంటెడ్ సినిమా అని సమాచారం. రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ చిత్రానికి యోగి దర్శకుడు. ఈ సినిమాకు 'రాక్షసి' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఫిల్మ్‌ఛాంబర్‌లో ఈ టైటిల్‌ని రిజిస్టర్ కూడా చేయించినట్టు తెలుస్తున్నది. ఇందులో సంయుక్త పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని వినికిడి. పేరుకు తగ్గట్టే వైల్డ్‌గా ఈ పాత్ర బిహేవ్ చేస్తుందట. అందుకే ఈ కథకు 'రాక్షసి' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఈ సినిమా నిర్మాణంలో కూడా సంయుక్త భాగస్వామిగా ఉంటారని తెలుస్తున్నది.



## మెగా ప్రయోగం

చిరంజీవి సినిమా అంటే.. అందమైన ఇద్దరు హీరోయిన్లుండాలి. అదిరిపోయే బీట్ ఉన్న పాటలుండాలి. అదరహో అనిపించే స్టెప్పులుండాలి. మెగా టైమింగ్‌కి తగ్గట్టు డైలాగులుండాలి.. ఈవన్నీ ఉంటేనే అది చిరంజీవి సినిమా. కానీ మెగాస్టార్ ఇవేమీ లేకుండా ప్రయోగాత్మక సాహసానికి సిద్ధమవుతున్నారని సమాచారం. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా మే 9న విడుదల కానుంది. ఆ తర్వాత అనిల్ రావిపూడి సినిమా ఉంటుంది. ఆ తర్వాత 'దసరా'ఫేం శ్రీకాంత్ ఓదెల సినిమా చేస్తారు చిరంజీవి. ఈ సినిమా విషయంలోనే చిరంజీవి ప్రయోగం చేయనున్నారని తెలుస్తున్నది. ఈ సినిమా కమల్‌హాసన్ 'విక్రమ్' తరహాలో ఉంటుందట. ఇందులో ఫైట్లు తప్ప డాన్సులు, హీరోయిన్లతో ఆటపాటలు, కామెడీ ఇలాంటివేం ఉండవంట. చిరు క్యారెక్టర్ చాలా ఇంటెన్స్‌గా ఉంటుందని, మెగా అభిమానులు పండుగ చేసుకునేలా క్యారెక్టరైజేషన్ ఉంటుందని సమాచారం.



## ఓజీలో డీజే టిల్లు భామ నేహాశెట్టి

టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న మోస్ట్ క్రేజీయెస్ట్ సినిమా ఓజీ. సుజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్‌కు సంబంధించిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ చిత్రంలో స్పెషల్ సాంగ్ ఉండబోతుందట.. ఈ పాటలో డీజే టిల్లు భామ నేహాశెట్టి మెస్మరైజ్ చేయబోతుందట. పవన్ కల్యాణ్‌తో నేహాశెట్టి స్టెప్పులేయబోతుందన్న వార్తలపై ప్రస్తుతానికి అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. ఈ అప్‌డేట్‌ను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూలీ లవర్స్ అండ్ ఫ్యాన్స్. ఈ చిత్రంలో గ్యాంగ్ లీడర్ ఫేం ప్రియాంకా ఆరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రియారెడ్డి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య తెరకెక్కిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన ఓజీ గ్లింప్స్.. పవన్ కల్యాణ్ పూర్తిగా నయా అవతార్‌లో చూపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ జపనీస్ నటుడు కజుకి కిటముర, ప్రముఖ థాయ్ యాక్టర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## నాగచైతన్య, సాయిపల్లవి శివతండవం

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం తండేల్. చందూ మొండేటి డైరెక్షన్‌లో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025 ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఇప్పటికే విడుదల చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా తండేల్ సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. శివశక్తి ఫుల్ సాంగ్‌ను డిసెంబర్ 22న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. చైతూ, సాయిపల్లవి శివతాండవం చూపించబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోంది తండేల్. ఈ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.



Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written